# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్  బుధవారం 14-1-2026  NETI NIZAM Telugu Daily,  RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.  సంపుటి :32  సంచిక:130  పేజీలు:6  వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

రూక పతనం
అయోమయంలో మార్కెట్
ధరల ఘాతం.

మరణ గీతం
సుస్వర విరచితం
మనసు మర్మం
జీవన చర్యలు
క్రియల ఫలితాలు
వెల్గు నీడలు.

హామీల ఒట్టు
ఓటుకొరకె పెట్టు
అసుర హస్తం

బాధ నవ్వులు
మనసు కవాటాలు
ప్రేమ బంధాలు.

- రేడియమ్
సెల్: 9291527757



**శ్రీనిజాలు**

ఆంధ్ర తెలంగాణ మధ్య
ఇదేమి ఆనవాయితీ !
ఎన్నేళ్లయినా ఒడవదా
ఈ నీళ్ల పంచాయితీ !
నీటిని వినియోగంలో
ఎవరి హక్కు వారిది !
నీళ్లను తరలింపు కొరకు
ఎవరు దీని సారథి !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



## భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ కిటకిట..





వరంగల్,జనవరి 13: మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు భక్తులు ముంద స్తు రాకపోకలతో హనుమకొండ బస్టాండ్ ప్రాంగణం కిటకిటలా డుతోంది. మేడారం జాతరకు వెళ్లడాని కి ప్రయాణికులు రోజు రోజుకు పెరుగుతుండడంతో సాధారణ రోజుల్లో 8 బస్సు సర్వీస్‌లు నడవగా నాలుగు రోజుల నుంచి 35 నుంచి 40 బస్సు సర్వీస్‌లు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు సోమవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మేడారానికి భక్తులు తరలి వెళుతుండడంతో బస్టాండ్‌లో రద్దీ ఏర్పడుతోంది. ప్రయాణికు లకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే అవసరా న్ని బట్టి మరిన్ని సర్వీస్‌లు పెంచుతామని అధికా రులు తెలిపారు. భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను వెల్లడిం చారు. కాగా, ప్రస్తుతం మేడారం వెళ్లే భక్తులకు పెద్దలకు రూ. 190, పిల్లలకు రూ. 80 టికెట్ ధర ఉన్నట్లు మేడారం వెళ్లే బస్సులకు ఎక్స్‌ప్రెస్ చార్జీలే వసూలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## జ్ఞాన సరస్వతీ ఆలయంలో అవకతవకలు...

నిర్మల్, జనవరి 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో (ఆర్థిక అక్రమాలు, అవకతవకలపై విజిలెన్స్ బృందం దృష్టి సారిం చింది. ఆల యంలో భక్తుల నుం చి సేకరించే హుండీ ఆదాయం, దాన ధర్మాలు, పూజలు, ప్రసాదా లు వంటి ఆర్థిక లావాదేవీలను గోప్యంగా పరిశీలిం చిన విజిలెన్స్ బృందం, పలు విభా గాల్లో అవకతవకలు జరుగుతు న్నట్లు ప్రాథమికంగా నిర్ధారించి ంది. సాధారణ భక్తుల రూపంలో ఆలయంలోకి వచ్చిన విజిలెన్స్ అధికారులు.. ఆలయ సిబ్బంది ఆర్థిక వ్యవహారాలు, రికార్డులు, లావాదేవీలను పరిశీలించారు. ఈ విచారణ గత కొన్ని రోజులుగా గోప్యంగా జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అంశాలపై విజిలెన్స్ బృందం లోతుగా దర్యాప్తు చేపట్టింది. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ నివే దిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## రాజేంద్రనగర్‌లో భారీ అగ్నిప్రమాదం..



హైదరాబాద్, జనవరి 13: రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్ ప్రాంతంలో ఉన్న ఒక ప్లాస్టిక్ రీసైకిల్ యూనిట్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు ఎగిసిపడడంతో పాటూ దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలంలోనే ఉన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థాని కులు.. పోలీసులు సమాచారం అందించడంతో వెంటనే రంగం లోకి దిగారు.

మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. అయితే పరిశ్రమలో ప్లాస్టిక్ నిల్వలు భారీగా ఉన్నాయని.. అవి మొత్తం అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

షార్ట్ సర్క్యూట్ వల్లా లేదా ఇతర సాంకేతిక కారణా లేమైనా ఉన్నాయా.. అని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దట్టమైన పొగ కారణంగా చుట్టు పక్కల ఉన్న ప్రజలు ఊపిరిపీల్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదంలో ఎంత మేరకు ఆస్తినష్టం జరిగిందనే వివరాలు తెలియాల్సి ఉంది.

## అలిశెట్టి కవితలు రాజ్య ధిక్కార సంస్కృతికి ప్రతిబింబాలు



ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ వర్ధంతి సభలో పాల్గొన్న అతిథిలు కె. శ్రీనివాస్, బి.యస్.రాములు, డా॥నందిని సిధారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, బి. నర్సన్, జయధీర్ తిరుమలరావు, పాశం యాదగిరి, ఘంటా మనోహర్‌రెడ్డి, అలిశెట్టి కొడుకు సంగ్రామ్, భార్య భాగ్యమ్మ తదితరులు

హైదరాబాద్, జనవరి 13: తెలంగాణ నేలకు ఉన్న రాజ్య ధిక్కార సంస్కృతికి ఐకాన్‌గా అలిశెట్టి ప్రభాకర్ నిలుస్తారని పలువురు వక్తలు అన్నారు. ఆయన అక్షరాలకు మరణం లేదని, దేశంలో దోపిడీ, పేదరికం ఉన్నంత కాలం ఆయన కవిత్వం ఉంటుందని వారు పేర్కొన్నారు. ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ యాదిలో సంగోష్ఠి కార్యక్రమం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కవి నర్సన్ భద్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డా॥ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని ప్రేమించినంతగా దేనినీ ప్రేమించలేదని, ఆయన చనిపోయే వరకు కుటుంబం కన్నా, తన ఆరోగ్యం కన్నా కవిత్వం పైనే ఎక్కువ మక్కువ చూపించారని గుర్తు చేశారు. అలిశెట్టి ప్రభాకర్ విగ్రహం ముఖ్యమే కాని ఆయన కవిత్వం, ఆయన వ్యక్తిత్వం ఎంతో గొప్పదని, దాన్ని చిరస్మరణీయంగా ఉంచాలన్నారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ ప్రభాకర్ కవిత్వానికి పునరుజ్జీవనం ఇచ్చారని అన్నారు. రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు, సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్, పాశం యాదగిరి, ఘంటా మనోహర్‌రెడ్డి, తెలంగాణ విఠల్, కవి, రచయిత పసునూరి రవీందర్ మాట్లాడుతూ కవిత్వానికి తన జీవితాన్ని ధారపోసిన వ్యక్తి అలిశెట్టి అని తెలిపారు.

ఆయన 72వ జయంతి, 33వ వర్ధంతి రెండూ జనవరి 12వ తేదీన ఉండడం.. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషమని అన్నారు. ప్రభాకర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠిం చాలని, ఆయన కవితలను తెలంగాణ సాహిత్య అకాడమీ ద్వారా ప్రచురించాలని కోరారు. అలిశెట్టి కొడుకు సంగ్రామ్, భార్య భాగ్యమ్మ పాల్గొన్నారు.

## కైట్ ఫెస్టివల్.. ఆ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు..

హైదరాబాద్, జనవరి 13: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జనవరి 13 నుంచి 15 వరకు అంతర్జాతీయ కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్ - 2026 జరుగనుంది. ఈ ఫెస్టివల్‌ని గ్రాండ్ సక్సెస్ చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్‌కు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తాజాగా ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీసులు కీలక అడ్వైజరీ ప్రకటిం చారు.

13, 14, 15 తేదీల్లో పరేడ్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆక్షలు విధిస్తున్నట్లు సదరు ప్రకటనలో తెలిపారు. పలు రూట్లలో ట్రాఫిక్ మళ్లిస్తుండగా.. మరికొన్ని రూట్లను పూర్తిగా క్లోజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో పరేడ్ గ్రౌండ్స్ పరిసర రహదారులను ప్రజలు వీలైనంత వరకు నివారించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

**రాధశ్రీ రాగాలు**

పర్వ దినమగు భోగి
నాడొక మహాత్యాగి
అయ్యెను మహాయోగి
అనును రాధశ్రీ
ఈ మకర సంక్రాంతి
సరిగ తెచ్చుచు క్రాంతి
జనుల కొసగును శాంతి
అనును రాధశ్రీ

-రాధశ్రీ
సెల్:9494481210



## ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుండగా విషాదం.. ఇద్దరి పరిస్థితి విషమం..

హైదరాబాద్, జనవరి 13: హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రధాన మార్గంలో ఈ రోజు (మంగళవారం) ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తున్న ఊబర్ క్యాబ్.. డివైడర్‌ను ఢీకొని కంట్రోల్ తప్పింది. ఈ ప్రమాదంలో ఐదు నెలల గర్భిణితో పాటు ఆమె తల్లి తీవ్ర గాయాలపాలయ్యారు.

ఈ ప్రమాదం చోటుచేసుకున్న వెంటనే స్థానికులు అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందజేశారు. అయితే దాదాపు గంట సమయం వరకు అంబులెన్స్, పోలీస్ సిబ్బంది రాలేకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం, ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను శంషాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రు లను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారు డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పిందని.. ఇది ప్రమాదానికి ప్రధాన కారణమని వెల్లడించారు. కారు వేగంగా వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ, ట్రాఫిక్ రిపోర్ట్‌లు, డ్రైవర్ వివరాలు సేకరించడానికి దర్యాప్తు ప్రారంభించారు.

## మూడు రోజులముచ్చటైన పండుగ సంక్రాంతి

హిందువులకు అత్యంత ప్రీతికరమైన పండుగ సంక్రాంతి. ఇది పుష్య మాసంలో సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజు.

సంక్రాంతిలో 'సం' అంటే మిక్కిలి,' క్రాంతి 'అంటే అభ్యుదయం అని అర్థం. అభ్యుదయాన్ని ఇచ్చేది కనుక సంక్రాంతిగా పిలువబడింది.

'మకరం' అంటే మొసలి. మొసలి బలం మనకు తెలిసిందే కదా! ఇది పట్టుకుంటే వదలదు. మానవుని యొక్క ఆధ్యాత్మిక జీవితానికి అడుగ డుగున అడ్డు తగులుతుంది. అందు వల్ల ఈ పుణ్య దినాల్లో ఎవరికి వారు భక్తి భావాలతో దైవాన్ని కొలుస్తూ, దానధ ర్మాలు చేసి, మోక్షానికి మార్గం వేసుకోవాలని పెద్దల మాట.

సంక్రాంతి అంటే సంక్రమణం. సంక్రమణం అంటే కదలిక. సూర్యుడు ఈ సంక్రాంతి పండుగ రోజుల్లో ధనుస్సు రాశి నుండి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. కనుక ఇది మకర సంక్రాంతి అయింది. సంక్రాంతి నుండి సంవత్సరంలో ఆరు మాసాలు దక్షిణాయన కాలం పూర్తై ఆరు మాసాల ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది.

ఉత్తరాయణకాలంలో స్వర్గ ద్వారాలు తెరవబడతాయని ఈరోజు ల్లో పరమపదించిన వారు నేరుగా స్వర్గానికి వెళ్తారు అనేది ఒక మాట. మహాభారత యుద్ధంలో భీష్ముడు ఉత్తరాయణ కాలం వరకు అంపశయ్య మీద పడుకుని ఉత్తరాయణంలో మరణం కోరుకున్నాడన్నది జగద్విితమే.

దక్షిణాయనం పూర్తయి ఉత్తరాయనలోనికి సూర్యుడు ప్రవేశం చడంతో ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభం అవుతుంది. ధనుస్సు రాశి నుండి మకర రాశికి మారడాన్నే మకరసంక్రాంతి అంటారు. ఈ మార్పు సంవత్సరం పొడుగున జరిగిన సూర్యుడు మకర రాశిలోనికి ప్రవేశించడమే ముఖ్యం కనుక మకర సంక్రాంతి సంక్రమణాన్నే మకర సంక్రాంతిగా భావిస్తున్నాం.

డిసెంబరు16 నుండి ధనుర్మాసం ప్రారంభమవుతుంది .ఈరోజు నుండి సంక్రాంతి వరకు నెల రోజులు దేవాలయాలలో ఇంటిలో గోదాదేవి రచిం చిన పాశురాలను పాడుతుంటారు. గోదా, రంగనాధుల వివాహ వివాహ ఉత్సవంతో ధనుర్మాసం ముగుస్తుంది. అంతేకాదు ధనుర్మాసం శుభకార్యా లకు ప్రశస్తమైనది. రైతులకు పంట చేతికొచ్చి ఇండ్లలో ధాన్యపు నిలువల తో ఆనందించే కాలం.

సంక్రాంతి మూడు రోజుల పండు గ .భోగి పండుగ పిల్లలకు పెద్దలకు ఆనందాన్ని పంచేదిగా.... సంక్రాంతి పితృదేవతలను సంతృప్తి కలిగించేదిగా..... కనుమ పండుగ రైతులతో పాటు కష్టపడే పశువులకు జరిపే పండుగగా జరుపుకుంటాము.

ప్రకృతిపై ఆధారపడి జీవించే మానవులం కనుక ప్రకృతిని పంచభూతాలను పూజించమని తెలిపే పండుగ. మనది వ్యవసాయం ప్రధానమైన దేశం. వ్యవసాయంలో తగిన ఫలాలను పొందాలంటే రైతు తాను పండించిన ధాన్యాన్ని మొదటగా ఇలవేల్పులకు, గ్రామదేవతలకు నైవేద్యం సమర్పిస్తాడు. తనతో కష్టపడిన వారికి బీదలకు, దానధర్మాలు చేసి భగవంతుని కృపకు పాత్రుడవుతాడు.

### భోగి పండుగ

భోగం అంటే ఉత్తమ యోగం అన్ని పరిణామాలను సాధారంగా స్వీకరిస్తూ సానుకూలంగా మసులుకోవాలని ఈపండుగ తెలియచేస్తుంది.

కూడల్ల మధ్య, ఇండ్ల వద్ద భోగి మంటలు వేసి తమ ఇళ్లలో ఉన్న పాత వస్తువులను మంటల్లో వేస్తారు. వాడేసి పారేయడమే కాదు అవసరం తీరిన దాన్ని గౌరవంతో వీడడమని మన సంస్కృతిలో ఉండే సున్నితత్వాన్ని తెలుపుతుంది. చీడ,పీడలు తొలగించే వాటినే భోగి మంటలు అంటారు.

ధనుర్మాసం మొదలుపెట్టిన నాటి నుండి పిల్లలు,పెద్దలు కలిసి ఇంటి ముందువేసే రంగవల్లులు ఎంతో శోభను చేకూరుస్తాయి.

భోగినుండి ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెడతారు. ఆవుపేడతో గొబ్బెమ్మలను చేసి , పసుపు, కుంకుమ పూలతో అలంకరించి ముగ్గుల మధ్యలో మూడు గొబ్బెమ్మలు పెడతారు. ఒకటి కృష్ణునిగా, రెండవది గోమాతగా, మూడవది గోవర్ధనగిరి సంకేతాలుగా చెప్పబడుతాయి. అలంకరించిన ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెట్టి ముగ్గు చుట్టు తిరుగుతూ ఆడపిల్లలు గొబ్బి పాటలు పాడుతారు. అలా చేయడం వలన తమ కోరికలు నెరవేరు తాయనే నమ్మకం.



ధనుర్మాసంలో ధనుర్మాస వ్రతం చేసి, విష్ణుమూర్తిని ఆరాదించి, మకర సంక్రమణానికి ముందు రోజు విష్ణువును గోదా దేవి వివాహమాడింది. ఆ వివాహానికి శుభ సూచికయే భోగి పండుగ అంటారు.

ఈరోజు సాయం కాలం చిన్న పిల్లలపై భోగి పండ్లు పోసే సంప్రదాయం భారతీ య సంస్కృతిలో ఆధ్యా త్మిక భావన పౌరాణిక విశ్వాసం శాస్త్రీ య ఆలోచన కలిగి ఉన్నదే భోగి పండుగ.

రేగుపండ్లను తల మీద పోయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోయి నారాయణని అనుగ్రహం లభిస్తుందని పిల్లలు జ్ఞానం పెరుగుతుందని పెద్దలు చెప్తారు. చెరుకు గడలు. బంతిపూల రెక్కలు చిల్లర నాణాలు భోగి పండ్లలో వాడుతారు. రేగుపండ్లకు బదిరీ ఫలాలని పేరు .శివుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికి నర, నారాయణులు బదరికా వనములో తపస్సు చేస్తుండగా ,వారి తలల మీద దేవతలు బదిరు ఫలాలను కురిపిం చారని అందుకు ప్రతికగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగి పండ్ల ను పోసే సాంప్రదాయం ఏర్పడింది.

### సంక్రాంతి పండుగ

సంక్రాంతి పండుగ నాడు తమ ఇలవేల్పులను కొలుచుకుంటారు. ఈ మాసంలో చలి ఎక్కువగా ఉంటుంది. పల్లెటూర్లలో ప్రతిరోజు వాకిట్లో ఆవుపేడతో కల్లాపి చల్లి ముగ్గులు పెట్టి రంగులద్ది పసుపు కుంకుమలతో పూలతో గొబ్బెమ్మలను తయారుచేసి ముగ్గులు పెడతారు.

### పట్టణాలలో కూడా ఇంతులు

ముంగిళ్ళలో ముగ్గులను, గొబ్బె మ్మలను పెట్టి సంస్కృతీ సంప్రదాయాలను నిలుపు తున్నా రు.

ప్రతిఇల్లు బంతి, మామిడి తోరణాలతో అలంకరిస్తారు.

వ్యవసాయదారులు ఇంట్లో ధాన్య పునిలు వలు. బంధు వులు , అత్తవారింటికి వచ్చిన ఆడపిల్లలు, అల్లుళ్లతో ఇల్లంతా సందడిగా ఉంటుంది.

ఇంటిముందు వరి కంకులు పిట్టల కోసం కడతారు. మన తెలంగాణలో సంక్రాంతి పండుగ రోజు కొమురవెల్లి బోనాలు చేసుకుంటారు. స్త్రీలు సం క్రాంతి నోములు, వ్రతాలు చేసుకుం టారు. పిల్లలు,పెద్దలు నూతన వస్త్రాలు ధరించి ఆనందంగా ఉంటారు. పిండి వంటలలో ఎక్కువగా సకినాలు, అరిసె లు చేస్తారు. సకినాలలో నువ్వులు, ఓమ, అరిసెలపై నువ్వులు గసగసాలు చల్లడంతో శరీరంలో వేడిని పుట్టి స్తాయి.

గంగిరెద్దుల వాళ్లు, బుడబుక్కల వాళ్ళు హరిదాసులు వస్తారు. ఎవరు వచ్చినా, ఉన్నంతలో లేదనకుండా పెట్టి పంపడమే మన ఆచారం. ప్రతి పండక్కి ప్రత్యేక దేవతలను ఆరాధించడం మన ఆచారం. సంక్రాంతి అధిష్టాన దేవత పేరు వారంతో ముడిపడి ఉంటుంది. సంక్రాంతి ఆదివారం వస్తే -ఘోర అని సోమవారం- ధాన్యలక్ష్మి మంగళవారం- మహోదరి బుధవారం - మందాకిని శుక్రవారం - మిశ్రా శనివారం -రాక్షసిగా పిలవబడుతుంది. సంక్రాంతి ఏ రోజు వస్తే ఆ పేరుతో పండుగను జరుపుకోవడం అనాదిగా వస్తున్నది.

బ్రాహ్మణులకు దానాలు ఇస్తారు. సాయంత్రాల్లో బొమ్మలకొలువుతో సందడి చేస్తారు. వివిధ ప్రాంతాల వారు కన్నుల పండుగగా సంక్రాంతిని జరుపుకుంటారు.

### కనుము

సంక్రాంతి పండుగకు మూడో రోజు కనుమ పండుగ జరుపుకుంటాము. ప్రకృతిని దైవంగా భావించి పూజించే కనుమ పండుగ ప్రధానంగా మూడు రోజుల సంక్రాంతి పండుగలో భాగంగా మూడో రోజున కనుమ పండుగగా, నాలుగో రోజున ముక్కనుముగా జరుపుకుంటాం. కనుమ పండుగ ముఖ్యంగా రైతుల కోసం. ఈ రోజున పాడి పంటలను సంపదను లక్ష్మీ స్వరూపంగా భావించి పూజిస్తారు.

బలరామకృష్ణులు గోపాలకులుగా మనకు పూజ్యనీయులు. బలరాముడు వ్యవసాయ ప్రధానమైన నాగలిని, వంటఇంటి సాధనమైన రోకలిని ఆయుదాలుగా కలవాడై రైతులకు స్ఫూర్తి ప్రదాతగా కనిపిస్తాడు. ఇక గోపాల కృష్ణుడు ఆలమందను కాయుటం, గోపాలకులతో చల్ది భుజించటం మొదలైన కథల ద్వారా, బలరామకృష్ణులు పాడి, పంటలద్వారా లోక శ్రేయస్సును కోరుకున్న వారని తెలియుచున్నది. భగవంతుడే రైతు రూపాన్ని ధరించి దేశాన్ని సస్యశ్యామలం చేయడం.పాడి, పంటలే జీవనాధారమై బతకడం మనకు కనిపిస్తుంది.

కనుమ పండుగ రోజున సంవత్సరమంతా రైతులకు చేదోడుగా ఉండే పశువులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ వాటిని శుభ్రంగా కడిగి అలంకరించి పూజిస్తారు. పశువుల కొమ్ములకు రంగులు వేసి వాటి మెడలో రంగురం గుల పూసలు గంటలు కట్టి అలంకరిం చుతారు. పొంగళ్ళు వండి భూలక్ష్మి కి నివేదన చేసిన తర్వాత పొంగలిని తమ పంట పొలాల్లో చల్లుతారు. అలా చేయడం వలన పంటలు బాగా పండుతాయని విశ్వాసం. కనుమ రోజు కాకి కూడా కదల దని సామెత. ఎవరు ఊరి పొలిమే రలు దాటకూడదన్న సంప్రదాయం అనాదిగా వస్తున్నది. పండక్కి ఊరెళ్ళినవారు కనుమ రోజు తిరుగు ప్రయాణం చేయరు. ఇలా సంప్రదా యబద్ధంగా కనుమ పండుగ జరుపుకోవడం వల్ల సిరిసంపదలు పాడిపం టలు అభివృద్ధి చెందుతాయి అన్నది ప్రజల విశ్వాసం. సంవత్సరంలో మిగిలిన రోజులన్నీ తమతో పాటు కష్టపడి పనిచేసిన ఆవులను, ఎద్దులను, గేదెలను తదితరాలను పూజించి ప్రేమగా చూసుకునే రోజు ఇదే. పక్షులు కూడా రైతన్న నేస్తం. అందుకే పక్షుల కోనమన్నట్లు ఇంటి గుమ్మానికి వరి కంకులు కూడా వేలాడదీస్తారు .

ఎడ్ల పందాలు ,కోడి పందాలు కూడా జరుపుకొంటూ సంక్రాంతిని వైభవంగా జరుపుకుంటారు.

ఎక్కడెక్కడో ఉద్యోగాలలో వ్యాపా రాలలో మునిగితేలే వాళ్ళందరు. స్వంత ఊర్లకు పయనమై వెళుతారు. పచ్చని ప్రకృతిలో బంధువులు, స్నేహి తులు కలిసి సంతోషం గా గడిపే సంతసాల పండుగ సంక్రాంతి.

-డా. బండారి సుజాత
9959771228



నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 బుధవారం 14-1-2026


## సప్త పదులు

మమకారం
సంస్కారం
కుటుంబంలో
ప్రతివ్యక్తి
మధ్య ఉండాలి
సహకారం

-హైమ. కందుకూరి
హైదరాబాద్

పరువు
తెరువు
కష్టమును
మన కిష్టమైనవారితో
పంచుకోకుంటే
జీవితమవుతుంది
బరువు

-విజయకుమారి
ముదిగొండ

కరవరాదు
మురవరాదు
కన్నతల్లిని,
మాతృదేశాన్ని,
గురువును
ఎన్నడును
మరువరాదు.

శ్రీనారా
హైదరాబాద్.

## సప్త పదులు

పిడి
రాపిడి
అమాయకుల
సొమ్మును
మాయమాటలతో
చేస్తారు దోపిడి.

-ఋష్యశృంగు
ఢిల్లేశ్వరరావు

వశ్యం
అవశ్యం
మనసున అభిమానం
ఆప్యాయతలే
కలిగించు పారవశ్యం

-ప్రసాద్ రావు,
9493166148

గుణాలు
అనుగుణాలు
దమం,
దానం,
దయ - మూడు
సద్గుణాలు.

-కే.ఎమ్.కె మూర్తి
9441802694

# వర్జ్యం

వర్జ్యం వర్జ్యం వర్జ్యం
కామక్రోధ లోభాల వర్జ్యం
మోహ మద మాత్సర్యాలు వర్జ్యం
నిదురలో కలవరింత వర్జ్యం
నీలో నాలో ఈర్ష్యా ద్వేషాలు వర్జ్యం
ఇంటిలోని కసుపు వర్జ్యం
కంటిలోని నలుసు వర్జ్యం
మనసులోని మాలిన్యం వర్జ్యం
మమకార, అహంకారాలు వర్జ్యం
అనాచారం, దురాచారం వర్జ్యం
మూఢాచారం, వామాచారం వర్జ్యం
అంటరానితనం వర్జ్యం
పురుషాధిక్యత వర్జ్యం
జడ పూజలు వర్జ్యం
గడసాములు వర్జ్యం
బానిసత్వం వర్జ్యం
ప్రగల్భాలు వర్జ్యం
కామ్య కర్మలు వర్జ్యం
కావ్యాలాపాలు వర్జ్యం
బలహీనత వర్జ్యం
భావ దాస్యం వర్జ్యం
స్వార్థపరత్వం వర్జ్యం
సంకుచితత్వం వర్జ్యం
నమ్మకద్రోహం వర్జ్యం
నాస్తికత్వం వర్జ్యం
కలహాలు వర్జ్యం
విలయాలు వర్జ్యం
పనికిరానిది వర్జ్యం
ప్రమాణం కానిది వర్జ్యం
కాలానికి లేదు వర్జ్యం
కవి కలానికి
లేదు వర్జ్యం.



- మసన చెన్నప్ప
9885654381

# బాల మురళీకృష్ణ గళ కవలికలు
# గాంధర్వ సోనలు



‘సమ్యగీతమితి’ సంగీతం అన్నారు, తప్పులు పాడడానికి భయపడటమే సంగీతం. ‘ఏటిలోని కెరటాలు ఏరు విడచి పోవు/ ఎదలోపలి మమకారం ఎక్కడికీ పోదు’ అన్న తొలిపాటతో చిత్ర పరిశ్రమకు పరిచయమై కొనసాగితూ ‘సలలిత రాగ సుధారస సారం’ ‘నర్తనశాల’ చిత్రంలో యన్. టి. రామారావు నాట్యాచార్యుని నటనకు దీటుగా, యల్. విజయలక్ష్మి అడుగులకు అధ్భుత స్వరాన్ని అందిచాడు. ‘మౌనమె నీ భాష ఓ మూగ మనసా ‘గుప్పెడు మనసు’, సినిమా కోసం ఆలపించిన గీతానికి భావసాంద్రతను జోడించాడు ‘పాడనా వాణి కల్యాణిగా’, ‘ఆదియనాదియు నీవే దేవా’ లాంటి సినీగేయాలను, అలవోకగా ఆలపించి, శ్రోతలను ఉర్రూతలూగించిన ఈ గాయకుడు, తన 8వ ఏటనే మొదటి కచేరీని ప్రారంభించి(1939) , అతి చిన్న వయసు నుండే గాత్ర కచేరీలు చేసి చివరి వరకూ కొనసాగించిన ఆ బాల గాంధర్వుడు ఎవరో కాదు..., తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరి పీఠాలకు ఆస్థాన విద్వాంసులుగా ప్రసిద్ధికెక్కిన గంధర్వ గాన సామ్రాట్ బిరుదాంకితులైన మంగళంపల్లి బాలమురళీకృష్ణ. మద్రాసు రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకాలోని శంకరగుప్తం గ్రామంలో జూలై 6,1930 న మంగళంపల్లి పట్టాభిరామయ్య, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించాడు మురళీకృష్ణ. ఇక బాలమురళీకృష్ణ గా మారడానికి ఒక కథ వుంది. 1938 జూలైలో తన 8వ ఏట గురువు పారుపల్లి, వారి గురువుగారైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి పేరున ఏర్పాటు చేసిన ఆరాధనోత్సవాల సందర్భంగా మొట్టమొదటిసారి కచేరీ చేయడం జరిగింది. అదే కార్యక్రమము లోనే వున్న ప్రముఖ హరికథా విద్వాంసులు ముసునూరి సత్యనారాయణ మురళీకృష్ణ గానానికి ముగ్ధుడై ఆ పిల్లవాడి పేరుకు ముందు ‘బాల’ అని చేర్చి ప్రశంసించారు. అలా బాలమురళీకృష్ణ గా స్థిరపడిపోయాడు జీవితాంతము. బాల మురళీకృష్ణ మొదటి గురువు కొచ్చర్లకోట రామరాజు, తరువాత సుసర్ల దక్షిణామూర్తి, ఆ తరువాత ఆయన శిష్యుడైన పారుపల్లి రామక్రిష్ణయ్య పంతులు దగ్గర ఉన్నత స్థాయి సంగీతాన్ని నేర్చుకొన్నాడు. బాలమురళీ ప్రత్యేకత ఏమిట ంటే మంత్ర ముగ్ధులను చేసే గాత్రం, కంపోజింగ్ లో ఉత్తమశైలి, ఈ లక్షణాలే వారిని సంగీత సామ్రాజ్యానికి చక్రవర్తిగా చేసినవి. అనేకానేక సంగీత ప్రక్రియలతోపాటు జుగల్ బందీ తరహా కచేరీ రూపకల్పనకు బాలమురళీకృష్ణ ఆధ్యుడు. మహామహులైన పండిట్ భీమసేన్ జోషి, పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, కిశోర్ అమోన్కర్ వంటి వారితో జుగల్ బందీ కచేరీలు చేశారు. గొప్ప వయోలిన్ విద్వాంసుడే గాక వాగ్గేయకారుడు, గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, పరిశోధకుడు, బహుభాషాపండితుడు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 25000 కచేరీలు చేసిన ఘనత మంగళంపల్లి వారికే దక్కింది. బాలమురళీ ప్రతిభకు కొలమానాలు ఎన్నో లెక్కించుటకు వీలుపడనివి. అందులో మచ్చుకు కొన్ని..... ఇంతవరకు ఏ సంగీతజ్ఞుడు ఆవిష్కరించని రీతిలో కొత్తరాగాలను సృష్టించిన నాదబ్రహ్మ. వాటిలో ప్రతి మధ్యమావతి, మహతి, సిద్ధి, మోహనాంగి, మురళీ ముఖ్యమైనవి. త్రిముఖి, పంచముఖి, సప్తముఖి, నవముఖి అనేవి వారి కొత్త తాళవ్యవస్థ లో ప్రాథమిక వర్గీకరణలు. 400 వందలకు పైగా స్వర రచనలు, 72 మేళకర్త రాగాలతో స్వరపరచిన అతి తక్కువ మందిలో బాలమురళీకృష్ణ ఒకరని అంటారు. ‘మానసిక రుగ్మతలపై సంగీత చికిత్స’ అన్న పరిశోధనా పత్రాన్ని కప్పగంతుల శ్రేయతో కలసి రచించారు. గాయకుడిగా అనేక భారతీయ భాషలలోనే గాక ఫ్రెంచి భాషలో కూడా పాడారు. ఇక బిరుదులు, అవార్డుల మాటకొస్తే ఎన్నో... ఎన్నెన్నో... ప్రపంచస్థాయిలో అత్యుత్తమ పురస్కారమైన **‘చేవెలియర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్’** గౌరవాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం నుండి పొందాడు. ఆధునిక త్యాగరాజు, సంగీత శాస్త్రజ్ఞుడు అన్న ఖ్యాతిమాత్రమే కాక సంగీత కళానిధి, గాన కౌస్తుభ, గాన గంధర్వ, జ్ఞాన సాగర లాంటి ఎన్నో బిరుదులు బాల మురళిని వరించాయి. బందా వెంకయ్య అనే మహాశయుడు రాసిన ‘మురళీ మాధురి’ గ్రంథంలో బాలమురళీ సమగ్ర జీవితాన్ని చరిత్రీక రించాడు. వీటన్నింటికన్నా, 10వ ఏటనే ‘ సెలబ్రెటి’ కావడం,తన 12వ ఏటనే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో పాల్గొనడం అపూ ర్వం. ఎంతో జనా దరన పొందిన, ఆకాశవాణిలో ‘భక్తిరంజని ‘ కార్యక్రమానికి రూపశిల్పి ఆయనే. కొత్త రాగాలతోపాటు తరంగాలు లాంటి మరెన్నో కొత్త ప్రక్రియలను ఆవిష్కరించిన బాలమురళి నవంబర్ 22, 2016 న నిష్క్రమించినా వారి స్వర మధురిమలు చిర స్మరణీయములు. ఎన్నో సాధించినా నిగర్వి అని చెప్పటానికి, ఆయన తరచూ అంటున్న ఈ వాక్యాలే సాక్షి...

‘నేను ఎప్పుడూ పాడను. పాడేది సంగీతమే’



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

పుస్తక సమీక్షలు

# తెలంగాణ పద మాధుర్యం

23 కథా సంపుటాలు 11 నవలలు 20 కవితా కావ్యాలు 32 బాల సాహిత్య సంచికలు పలు రేడియో నాటకములు, అను వాదాలు- ఐతా చంద్రయ్య సిద్దిపేటగారు తెలుగు సాహిత్యం లో చేపట్టని రచన లేదు. తాను రాయటమే కాదు. రాస్తోన్న తెలుగు సాహిత్యకారులను తను పురస్కారాలతో సత్కరిస్తున్నారు. సంస్థ ద్వారా పురస్కారాలు ఇచ్చి ప్రోత్సహించుతారు.

ప్రస్తుత కథా సంకలనం “పాయమాలు”లో 23 కథలు న్నాయి. పలు ప్రముఖ పత్రిక లలో లోగడ ప్రచురించబడి ప్రశంశలు అందుకున్నవి. మధ్య తరగతి అంతకంటే మరికొంత క్రింది సామాజిక వర్గాల కథలు వెతలు చంద్రయ్యగారి కథా వస్తువులు. తెలంగాణ వాసి. తెలంగాణ ప్రాంత భాషాప్రేమి. కథల్లో ఆ ప్రాంతపు భాష, యాస. నుడికారాలు విరివిగా దొర్లు తాయి. ఇందువల్ల ఆ ప్రాంత పాఠకులు పాత్రల్లో తమను, తమ పరిసరా లను చూడగలిగి ఆత్మీయులవు తారు. తెలంగాణేతర పాఠకులకు ఈ వాక్యాలు, పదాలు విన సొం పుగా ఉంటూ రచయితను, రచన ను అభినందించగలు గుతారు.

రేడియో, టీవీ లాంటి సాంకేతిక సాధనాలు రాక ముందు సాధనా శూరత్వం-అంటే గారడీ విద్య పల్లెల్లో మంచి వినోద కాలక్షేపంగా ఉండేది. నాలుగు రోడ్ల కూడలిలో ఈ సాధనా శూరులు కుటుంబం అంటే భార్య, భర్త,పిల్లలు కలిసి ప్రదర్శనలు ఇచ్చి పొట్ట పోసుకునే వారు. వీరు సామాన్యంగా దేశద్రిమ్మరులు. ఒక ఊరుకు వెళ్ళి ఆ గ్రామ అధికారిని కలిసి వారి సహకారంతో రెండు మూడు రోజులు ప్రదర్శనలు ఇచ్చి మరో ఊరికి తరలి పోయేవారు. వంశ పారం పర్యంగా వస్తోన్న సాధనా శూర త్వంతో పొట్ట పోసుకుం టున్నారు. రాజారాం, కొడుకు పరశురాములు. భార్యమణెవ్వ, రోజు రోజుకూ తగ్గుతోన్న ప్రజా దరణ వల్ల రాజారాం ఆదాయం క్రమేణా తగ్గుతూ వస్తోంది. ‘కులకశ్శికి సాటిరాదు గువ్వల చెన్నా!’ అన్నట్లు కొడుకును చదివించిన ఈ విద్యలోకి దింపుతాడు. కొడుక్కు భార్యకు ఇష్టం లేకున్నా దిగటం వల్ల రాజారాంను సాధి స్తూ వుంటారు. కొడుకు భవిష్య త్తును పాడు చేసానే అన్న అంత ర్మధనం అప్పుడప్పుడు ఆయనకు కలుగు తూంటుంది. ఎక్కడైనా జీతానికి పోతే బావుం టుంది అన్న ఆశ పరశురాము లుది. “సగమీ డు దిరిగినంక నముర్త కల్నాల న్నట్లు” ముప్పయి ఏళ్ళు దాటి నంక ఉద్యోగ మెవడిస్తడని తల్లి ఊదుపొాగ ఏసుడు. ముందుగాల నాకు లగ్గం జెయ్యి ఒద్రని కొడుకు వేధింపు. సొంత సంపాదనుంటెగని ఎవడు పిల్లని స్తడు- రాజారాం వెతపడటం.

ఈ కథకి ఎలా ముగింపు అది నమూ వెతపడనక్కరలేదు. చక్కని మలుపుతో రచయిత కథని సుఖాంతం చేస్తారు. బొంబై పోయిన బామ్మర్ది శంకరయ్య ఇర వయ్యేండ్ల పడుసుపిల్లతో రాజారాం ఇంటికి వస్తాడు. బొంబైల శంకరయ్య జీవితం బాగానే గడుస్తుండే. కాని ఏ దేవునికి కన్ను గుట్టిందో.. బైకు మీద పోతోన్న అల్లుడు, మనవడు ఆక్సిండెంటయి హరీ’ అంటారు. కూతురు భవానిని చూడలేక శంకరయ్య భార్య మరణిస్తుంది. శంకరయ్య భవానీలగతి ‘అంగట్ల అవ్వా అంటే ఎవనికి పుట్టినీవు బిడ్డా?’ అన్నట్లు అయింది. నా అన్న వాళ్ళు లేక తండ్రీ కూతుళ్ళు అక్క దగ్గరికి వస్తారు. పెళ్ళికాని వరశురాములు పసిప్రాయంలోనే విధవ అయిన భవానీని కలిపి రచయిత సుఖాంతం చేసారు. సాధనా శూరత్వం కథలో.





ప్రతులకు:
ఐతా చంద్రయ్య
ఇ.నెం.4-4-11, శేర్పుర
సిద్ధిపేట-502 103
సెల్: 9391205299

‘పాయమాలు’ పశువులు పక్కోడి పొలంలోనో మరో చోట పంట పాడుచేస్తే.. తీసుకెళ్ళి బిందిల దొడ్లో విడుస్తారు ఆ పశువుని. దాని స్వంతదారు పంట నష్టానికి పాయాలు (జుర్మాన) లేదా నష్ట పరిహారి ఇచ్చి పశువుని విడిపించుకుంటాడు. రచ యితకు నగరాల్లో రోడ్ల మీద తిరుగుతూన్న పశువులు. ఆవులు మరేవో కనిపించాయి. ఇవి రోడ్ల మీది చెత్తా చెదారం తింటూ యజమానికి పాలు ఇస్తుం టాయి.

ఇత్తారి బావది పల్లెటూరు. పట్నంల (హైదరాబాద్) మెట్రో రైలు ఎక్కి అన్నీ సూసి రావాలన్న ఖాయిషు (కోరిక). బామ్మర్దికి హైదరాబాద్‌ల ‘వాచ్మెన్’ ఉద్యోగం. రోడ్ల మీద శానగొడ్లు బర్లు మేకలు దర్జాగా పడుకోవ టం చూసి, పాయమాలు గట్టిం చుకొని ఇడిసి పెడదామని ఇత్తారి ఆలోచన. అన్నింటిని ఒక్క దిక్కు జమజేసే ప్రయ త్నం లో బావమరిదికి, ఇత్తారికి ఏమి కష్టాలు వస్తాయో ‘పాయమాలు’ వసూలు ఆలోచన నెర వేరిందో లేదె.. కథ చదవాల్సిందే!

నాడైనా, నేడైనా, రైతుల కష్టాలు, కడగళ్ళు దయనీయం. ఆరుగాలం శ్రమించి సేద్యం చేస్తే కాలం అనుకూలించకపోతే పస్తులే! ఆడపిల్లలు, పురుళ్ళూ, శరా! మామూలే! ‘శివతాండవం’ కథలో రైతు తిరుపతయ్యకు ఆ యేడు పంట కోతకు వచ్చింది. కూతురు ప్రమీలను ప్రసవానికి అల్లుడు విడిచిపెట్టిపోయాడు. అదో అదనం ఖర్చు.పంటకోత కూలీల కోసం ఊరంతా తిరిగాడు. ఎట్టకేలకు ధాన్యం మార్కెటు చేరింది. అంతకు ముందే అప్పు ఇచ్చిన యాదగిరి సేటు వెంటబడ్డాడు. ఆ రోజు పంట అమ్మకం కాలేదు. రాత్రి భీభత్స మైన వాన. పంట తడిచి పోతుంది. కొంత కొట్టుకుపోతుంది. అన్ని ఆశలు పంట మీదే ఉన్న తిరుప తయ్య కలలు కూడా కరిగి కొట్టుకుపోతాయి. ఆశావాది రచయిత ఐతా చంద్రయ్యగారు. తిరుప తయ్య నష్టాన్ని అంతా కలిసి భరిస్తామన్న’ భరోసాతో కథ ముగి స్తారు. అందరితోనూ, జాగ్రత్తగా ఉండాలని లేకపోతే జేబులు కత్తిరించబడతాయని చెప్పే ‘ఐదు రూపాయలు’ కథలో ఆయన జేజే కత్తిరించబడుతుంది. అనుకోని మలుపుకు మామయ్యేకాదు! మనమూ, షాక్ అవుతాము, ఈ కొస మెరుపు మలుపుతో.కథ, కథనుమించి కథనం రచయిత ప్రత్యేకత. కథలన్నింటా, తెలంగాణ పద మాధుర్యానికి పాఠకులు ముగ్ధులవుతారు. సారవంతమైన తెలంగాణా సాహిత్యంలో రచయిత ఐతా చంద్రయ్యగారు చేయి తిరిగిన రచయిత అని పాఠకులు ఒప్పుకుంటారు.



- కూర
చిదంబరం
8639338675

# అవ్వారు నానీల్లో మానవీయ ఆనవాళ్లు

“మంచు బిందు వులు” తర్వాత మరో నానీల సంపుటితో మన ముందు కొచ్చారు అవ్వారు శ్రీధర్ బాబు. తడవ టానికి సిద్ధంగా ఉండమనే సంకేతాన్ని అందిస్తూ ఈసారి సంపుటానికి **“నానీల వాన”**గా నామకరణం చేశారు. పుస్తకంలోని తొలి భాగంలో విభిన్న ఇతివృత్తాలపై నానీలను కురివించిన కవి; అనంతరం ‘మనిషి నానీ లు’, ‘రైతు నానీలు’, ‘బడి నానీలు’. ‘ప్రకృతి నానీలు’, ‘మానవత్వం నానీలు’, ‘అక్షరం నానీలు’, ‘కరో నా నానీలు’, ‘తరువు నానీలు’ అంటూ మరికొన్ని ప్రత్యేకాం శాలతో కూడిన నానీలను చేర్చారు.





ప్రతులకు:
అవ్వారు
శ్రీధర్ బాబు
8500130770

సృష్టికి పంచభూతాలే ఆధారం. మానవజీవన ప్రవంతి నుంచి విడదీయలేని సహజ పాయలవి. వాటితో మనిషికి కుదిరే చెలిమి నుంచే సామాజిక చైతన్యం వెల్లివిరుస్తుంది. అదే లోక కళ్యాణానికి బాటలు వేస్తుంది. చెలిమి స్థానే స్వార్థపరత్వమో, బాధ్యతారాహిత్య మో చోటు చేసుకుంటే ప్రాకృతిక విధ్వంసం మొదలవు తుంది. ప్రస్తుతం మనిషి రెండో బలహీనత చెరలో చిక్కి, ప్రకృతి నుంచే కాదు; తన నుంచీ తనకు దూర మవుతున్నాడు.

ఈ దుష్పరిణామాల ఆనవాళ్లను పట్టించేందుకు శ్రీధర్ బాబు పదునైన పొట్టి పదాలతోనే గట్టి భావాలను రాబట్టేందుకు ప్రయత్నిం చారు. మనసుల మధ్య ఒళ్లు విరుచుకుంటున్న భేదాబిప్రాయాలే వినాశనానికి హేతువులని చెబుతున్నారు...

**“ఇప్పుడు యుద్ధానికి**
**ఆయుధాలక్కరలేదు**
**కాసింత అక్కసు**
**చాలు”**

లోపల కత్తులు దాచుకుని, పైకి పరిమళాలు వెదజల్లటానికి ప్రయత్నించే మనుషుల్ని నిత్యం చూస్తూనే ఉంటాం. పలకరింపులో పరమాన్నం వడ్డిస్తూ, నొసటి మడతలోంచి వెక్కిరింపులు వెదజల్లే వ్యక్తుల్ని కూడా కలుస్తూ ఉంటాం. ఇదిగో ఈ నానీలు రుచి చూడండి...

**“నవ్వు ముఖమే**
**మాట కూడా తియ్యనే**
**మనసులో మాత్రం**
**మాలిన్యం”**
**“కళ్లు**
**నవ్వుతున్నాయని మోస పోకు**
**నటనలో వాడు**
**ఆరితేరినవాడు”**

నోరు దాటితే ఊరు దాటుతుందన్నది నానుడి. ప్రతి ఒక్కరికీ నిత్యజీ వితంలో దఖలుపడే అనుభ వం అది. పైగా పనికిరాని కబుర్లకు గిరాకీ ఎక్కువేమో, వాయువేగంతో ప్రయాణిస్తుంటాయి. కడుపులో దాచుకున్న కుట్రల్ని ఇంటింటా చల్లుకుంటూ పోతాయి...

**“ఆ అడుగులు**
**జోరుగా పడతాయి**
**చిరుతపులి వేగం**
**పుకారుకి”**

దుఃఖానికి మూలం కోర్కెలేనంటాడు బుద్ధుడు. అవి అడ్డదిడ్డంగా పెరిగేకొద్దీ అడ్డమైన బుద్ధులు అవ యవాలన్నిటికీ వ్యాపించి, వ్యక్తినీ వ్యక్తిత్వాన్నీ కలుషితం చేస్తాయి...

**“కోర్కెలు...**
**తోటలో మొక్కలు**
**కత్తిరిస్తుంటేనే**
**అందం ఆనందం”**

అదిగో, అలవి మాలిన ఆ కోర్కెల్లోంచే పుట్టుకొస్తుంది దురాశ. అది కాస్తా దుర్బుద్ధికి దారి తీస్తుంది. కనిపించేదంతా తనదేనన్న దురూహ దేహమంతా విస్తరిస్తుంది. ఆ దాహ సముద్రంలో మునిగిపోయి నీడనిచ్చే చెట్టునీ, నీటినిచ్చే చెరువునీ ఆక్రమించాలన్న ఆరాటం మొదలవుతుం ది...

**“గొంతుక తడుపుతూ**
**నది**
**దాని గొంతుక కోసే**
**ప్రయత్నం మనిషిది”**
**“భూమి/**
**ఆగర్భ శ్రీమంతురాలు**
**లెక్కలేనన్ని/ సిరిసంపదలు”** అని గ్రహించిన మనిషి ఆ సౌజన్యాన్ని సమాజ హితానికి వాడుకోవాలన్న చిన్న లాజిక్ మిస్ అవ్వటమే అసలైన విషాదం...

**“మనమంతా**
**భస్మాసురులం**
**ప్రకృతి తలపై**
**చేతులుంచుతూ”**
**“రోజుకు/మూడు యమగండాలు**
**పూట పూటకు/ ఆకలి**
**నెదుర్కోటానికి”** అంటూ పేదరికం విశ్వరూపాన్ని వివరించిన కవి...

**“నీవు పట్టుకున్నావని**
**మురిసి పోకు**
**నిన్నే పట్టుకుంది**
**సెల్”** అంటూ ఆధునిక సాంకేతిక మాయాజాలంలో చిక్కుబడిపోయిన విషయాన్నీ కవిత్వీకరించారు.

**“తప్పుదు**
**పోరాటం**
**జన వ్యాఘ్రాలు**
**పంజా ఎత్తి నిలిచి నవ్వుడు”** వంటి నానీల రచనలో కవి ఇంకొంత కస రత్తు చేయాలి.

అట్లా అని, కవి కేవలం సమస్య లూ సంక్షోభాలనే తన నానీల్లో ఆవిష్క రించలేదు. కర్తవ్యాన్ని గుర్తుచేసే పుష్ప గుచ్ఛాలను కూడా అందించేందుకు ప్రయత్నించారు. మానవ జన్మకు పరమార్థాన్ని గ్రహించాల్సిన ఆవశ్యక తను కూడా వివరించారు.

**“పుట్టుకే జననం**
**అంటే ఎట్లా...!**
**కొందరి మనసుల్లోనైనా**
**నీవు పుట్టాలిగా...!”**

ఒక్కసారి నిష్కామయోగిలా మంచం వేసుక్కూచొని, మనసును ప్రక్షాళన చేసుకొని, జ్ఞానదృష్టితో విశ్వంలోకి చూపు సారించితే... మనం ఎదిగామను కుంటున్న ఎత్తుల్లోని డొల్లతనం బయటపడుతుంది. సాధించామని విర్రవీగుతున్న విజయాల్లోని ఓటమి వెల్లడవుతుంది. అహాన్ని మించిన అజ్ఞానం లేదు. అదొక్కటీ అదుపులో ఉంటే...

**“ఓటమి కూడా**
**విజయమే**
**నీతోపాటుగా**
**నీ అహాలన్నీ ఓడాక”.**

అవ్వారు శ్రీధర్ బాబు కేవలం రాతలకే పరిమితం కాలేదు. చేతల్లో నూ సాహిత్య సేవలో నిమగ్నమైన మనిషి. ‘పెన్నా రచయితల సంఘం’ గౌరవాధ్యక్షుడి హోదాలో నెల్లూరు వేదికగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీనియర్ సాహితీవేత్తలను సత్కరించటం, వర్ధమాన రచయితలను ప్రోత్సహించటం వంటి కార్యక్రమాలతో తనవంతు సేవలందిస్తున్నారు. మానవ మేధస్సును మించిన మహౌషధి లేదని, ఆ ఒక్కటీ పరిమళిస్తే ప్రపంచం పూదోటలా పరిఢవిల్లుతుందని ఆయన నమ్మకం.

**“మేధస్సుకు**
**మానవత్వమంటిద్దాం**
**ప్రపంచం**
**అప్పుడొక పూలవనం”.**

ప్రసిద్ధ సాహితీవేత్తలు ఆచార్య ఎన్. గోపి, డాక్టర్ పెరుగు రామకృష్ణ, డాక్టర్ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి గార్లు రాసిన ముందుమాటల జల్లులు ఈ “నానీల వాన” తాలూకు ఆహ్లాదకర వాతావరణాన్ని కళ్లముందు ప్రత్యక్షం చేస్తాయి.

ఈ పుస్తకం ద్వారా అవ్వారు శ్రీధర్ బాబు మరిన్ని మంచి నానీలను అందించగలనన్న హామీ ఇస్తున్నారు.



-ఎమ్వీ రామిరెడ్డి
9866777870

## సంక్రాంతిలక్ష్మి ఆగమనం



మకరరాశిలో దినకరుని ప్రవేశం
తొలిపొద్దు పొడుపులో భానోదయం
ప్రకృతికాంత పలికింది శుభ ఆహ్వానం
పుడమితల్లి చేసింది తొలి సంతకం.
హరిత వర్ణపు చీరను కట్టి ,
సింధూరపు బొట్టును పెట్టి
జడలో చామంతులు,
మెడలో పూబంతులతో
ప్రకృతి గీచిన చిత్రిక సోయగం
నాజూకు నడకల నాట్య విలాసం
నయనానందకరం సంక్రాంతిలక్ష్మి
లాస్యం.
హరిదాసు కీర్తనల సరిగమల రాగం
సన్నాయి మేళల నాదాక్షరం
డు డు బసవన్న డమరుక తాళం
స్వరజతుల మిళిత సంగీత కావ్యం
శ్రవణానందకరం
సంక్రాంతిలక్ష్మి సుస్వర గీతం.
రమణీయ రంగవల్లికలలో
గొబ్బెమ్మల రూపం
పసుపు గడపలలో పడుతుల సౌభాగ్యం
ధనధాన్యాలలో గోమాతల స్వరూపం
శుభకర శోభితం సంక్రాంతి వైభవం
హృదయానందకరం
సంక్రాంతిలక్ష్మి ఆగమనం.



-కందాళం రజనీ రాణి
94877 08043

## సంక్రాంతి పండుగ రోజు

సంక్రాంతి పండుగ రోజు
తెలుగు ముంగిల్ల ముందు
కళ్లాపి చల్లిన భూమిని
కాగితంగా చేసుకొని
ముదితలందరు మునివేళ్లని
కుంచెలుగా చేసుకొనిజ
ముత్యాల ముగ్గులు
ముచ్చటైన ముగ్గులు
సొగసైన ముగ్గులు
సోయగాల ముగ్గులు
రమణీయ ముగ్గులు
రంగురంగుల ముగ్గులు
అందంగా చిత్రిస్తారు
ఆనందం కలిగిస్తారు
తెలుగు తరుణీమణులు.
ఒక వాకిలి ముందు
పిండివెన్నెలను తలపించే ముగ్గులు
ఒక లోగిలి ముందు
హరివిల్లులు భువికి
దిగివచ్చినట్టు రంగవల్లులు
చూసేవారి కనుదోయికి
కనువిందు చేసే ముగ్గులు
చిత్రించే చిత్రకారీమణులు
తెలుగు తరుణీమణులు.
ఇలాంటి చిత్రకారీమణులు
ప్రపంచాన ఎక్కడా లేరు
వాల్ల కళాసృష్టికి జేజేలు
వాల్ల ప్రతిభకు ప్రణామాలు.



- బూర దేవానందం
8143589789

## గానసభలో త్యాగరాయ కీర్తనలు

హైదరాబాద్, జనవరి 13: త్యాగరాయ గానసభలో మూడురోజులుగా త్యాగరాయ స్వామి ఆరాధన సంగీత నృత్య కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ప్రముఖ సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందంతో కలిసి త్యాగరాయస్వామి రచించిన ఎందరో మహానుభావులు, తెరతీయగరాదా తదితర కీర్తనలు గానం చేశారు. ఈసందర్భంగా సభలో గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ సంయుక్త గానసభలో సంగీత గురువు అన్నారు. గానసభ ఉచితంగా శాస్త్రీయ నృత్యం సంగీత వేణువాదన కళా ప్రక్రియల్లో శిక్షణనిస్తోందని, ఆసక్తిగలవారు నేర్చుకొనవచ్చును. కార్యక్రమంలో ప్రముఖ మహిళాసంస్థ అభినందన స్థాపకురాలు భవాని, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.



సంగీత కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

# ఆకాశమంత అక్షరం అడిగోపుల!

**"కవి నడిస్తే చాలదు**
**ముందడుగు వెయ్యాలి!**
**కలం రాస్తే చాలదు**
**కలకాలం నిలవాలి"**

–అంటున్న అడిగోపుల వెంకటరత్నం గారి కవిత్వంతో కరచాలనం చేసి, కలంతో కాలాన్ని జయించిన కవి. ఐదు దశాబ్దాలు గా కవిత్వం రాస్తున్నా అడిగోపుల వారి కలం దారి తప్పలేదు. పథం మారలేదు. వయస్సు పెరిగేకొద్ది అనుభవం విస్తరించి, పదునెక్కిన వారి కలం పురోగమన పథంలో పయనించింది. నిత్య చైతన్యాత్మ కంగా కొత్త సూర్యోదయాల్ని ఆవిష్కరించింది. తొలి అడుగు ల్లోని వైయక్తికతనించి సామాజికత వైపు పయనించి **'జయభేరి'** మోగించింది. వర్తమానంలోంచి భవిష్యత్తు వైపు పయనిస్తూ.. సమాజానికి సరికొత్త దారుల్ని చూయించింది. దారి తప్పుతున్న వ్యవస్థకు దిక్సూచిగ నిలిచింది. దారిద్ర్యాన్ని, దాన్ని బహూకరించిన దగుల్బాజీ రాజకీయాన్ని ఎండగట్టింది. నిరుపేదల పక్షాన నిలబడి దుఃఖాశ్రువులను తుడిచింది. ధైర్యం చెప్పింది. ఆకాశ మంత అక్షరమై విస్తరించింది. కాలం ఏదైనా, ఏ కవి రాసిన కవిత్వమైనా ఇంతకంటే సాధించే మహత్కార్యం ఏముంటుంది?

నన్ను, అడిగోపుల వారినీ కవి త్వమే కలిపింది. ఓ దినపత్రికలో ప్రచురింపబడ్డ వారి కవితను చదివి, నాకు తెలియకుండానే వారి కవిత్వాభి మానినయ్యాను.

**"ఎఱ్ఱజెండా**
**అరమీటరు**
**గుడ్డకాదు**
**అనేకమంది**
**రక్తం"**– అడిగోపులవారు కమ్యూనిస్టో? కాదో? నాకు తెలి యదు. కాని, ఎఱ్ఱజెండాకు కమ్యూనిస్టులు సైతం చెప్పలేని నిర్వచనాన్ని అద్భుతంగా అక్షరీకరించారు. దేశం జెండా అయినా, పార్టీ జెండా అయినా దాన్ని గుడ్డ ముక్కలా చూసే దేశభక్తి హీనుల కళ్ళు తెరిపించే కవిత ఇది. ఇదే కాలంలో (1981) నేను రాసిన

**'నాలుగు మార్గాల కూడలిలో**
**ఎఱ్ఱలైటు వెలిగితే ఆగండని!**
**నలుగురూ కలసి**
**ఎఱ్ఱజెండా ఎత్తితే సాగండనీ"** కవిత ఆంధ్రదేశమంతా పాఠకుల హృదయాల్ని తాకి **'ఎఱ్ఱలైటు కవి'**గా నాకు గుర్తింపునిచ్చింది. అడిగోపుల వారి కవిత చదివి, వారికి ఉత్తరం రాశాను. అది చదివి **'సూర్యోదయం', ఎన్నాళ్ళీ చరిత్ర'** కవితా సంపుటాలు, 'పురో గతి అంచున' కథల సంపుటి నాకు పంపారు. అవి చదివి నేను రాసిన విశ్లేషణాత్మక లేఖకు స్పందించిన అడిగోపులవారు గుంటూరులో తమ నివాసానికి ఆహ్వానించారు. ఆత్మీయంగా పలకరించారు. ఆతిథ్య మిచ్చారు. సతీసమేతంగా సాదరంగా వీడ్కోలు పలికారు. అప్పటి నుండి అంతిమ శ్వాస వరకు మా ఇద్దరి మధ్య కవిత్వం స్నేహ వారధిగా నిలి చింది. అక్షరం అంతరంగాలను వెలిగించింది. ఆత్మీయత ఆలింగనం గా మారి, వారి కవిత్వానికి నన్ను ఆత్మీయ శ్రోతను చేసింది.

కవిగా అడిగోపుల వారి ప్రయాణం ఆది నుండీ నాకు తెలుసు. వారి కవితా సంపుటాలన్నీ చదివాను. కాలానుగుణంగా మారుతున్న వారి భావజాలాన్ని గుర్తించాను. సాటి కవిగా గౌరవించాను. కవిత్వం వాహికగా వారు సమాజంతో మాట్లాడే తీరును స్వాగతించాను. వారి కవితా సంపుటాలు కొన్నింటిని పత్రికల్లో సమీక్షించాను. సమకాలీన సామాజిక సమస్యల్ని, భ్రష్టమ వుతున్న సామాజిక విలువల్ని వ్యాపారంగా మారి, వెగటు పుట్టి స్తున్న రాజకీయాల్ని, ధనస్వా మ్యం గుప్పిట్లో నలిగిపోతున్న ప్రజాస్వామ్యాన్ని, నేలను నమ్ము కున్న రైతుల్ని, వాళ్ల కడగండ్లనీ, కష్టాల్నీ, నిరాశ ఆవరించిన నిరుద్యోగుల్ని, మంటగలి సిపో తున్న మానవ సంబంధాల్నీ అడి గోపులవారు చిత్రించినంత బలంగా సమకాలీన కవుల వరూ కవి త్రీకరించలేదు. అలాగని అడిగో పులవారు ఏ సాహిత్య ఉద్యమాన్నీ భుజాన వేసుకోలేదు. అన్ని ఉద్యమాల్ని ఆకళింపు చేసుకొని, మానవత్వాన్ని, మహోదయాన్ని అక్షరోద్యమంగా వెలిగించిన అసలు సిసలైన అభ్యుదయ పథగామి మహోద యాన్ని అక్షరోద్యమంగా వెలిగించిన అసలు సిస లైన అభ్యుదయ పథగామి అడి గోపుల వెంకటర త్నంగారు.

అడిగోపుల వారు నిరంతర కవి. నిబద్ధతతో రాసే అనిబద్ధ కవి. వారు నిజానికి తప్ప ఏ ఇజానికీ కొమ్ము కాయలేదు. వారి కవిత్వంలో రాజకీయం వుంటుంది. కాని రాజకీయ మాటున జరిగే అరాచకాల్ని, అక్రమాల్ని నిలదీసే నిర్భయ స్వరం వారికే సొంతం.

**'నా గదె నా విశ్వ విద్యాల యం"** అన్న అడిగోపులవారు 29 కవితా సంపుటాల్లో 1700పైగా కవితలను పురడు పోశారు. అక్షరాల్ని ఆత్మీ యంగా తడిమి, తనిసి వాక్యాలకు వెలుతురు స్నానం చేయించారు. ఆఖరి శ్వాస వరకు సమాజంలోని చీకటిని ద్వేషించారు. వెలుతురును ప్రేమించారు. కవిత్వాన్ని కాంతిరేఖగా మార్చుకుని కాలరేఖకు కొత్త నిర్వచనంగా నిలిచారు.**"కాలం నా చేతిలోనే వుంది"** అని కలంతో నిరూపిం చారు.

ఋతువులు పుష్పించినట్లు గానే, క్రమం తప్పకుండా ప్రతియేటా కవితా సంపుటిని ప్రచురించే అడిగోపులవారి ఆనవాయితీని వారి కుమారుడు చి॥ శ్రీకాంత్, కుమార్తెలు చి॥ మాధవి, శాంతి, కవిగారి శ్రీమతి పద్మజలు కొనసాగిస్తూ అముద్రిత కవితలన్నింటినీ సంపుటిగా ప్రచురించి, నిండు మనసుతో స్మృత్యంజలి ఘటించారు. అడిగో పులవారు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఇంజనీరుగా ఉద్యోగించి, జీతం గింజలతో జీవ నం సాగించి, అక్షర సంపదను ఆస్తిగా ఇచ్చి, కుటుంబానికి ఆరాధ్యులయ్యారు.

చి॥ శ్రీకాంత్ పర్యవేక్షణలో, స్వీయ ముఖచిత్రంతో వెలువడిన **'అక్షరాలు మొలకెత్తుతూనే ఉంటాయి'** అడిగోపుల వారి చివరి కవితా సంపుటికి **'ముందు మాటై'** పాఠకుల్ని పలకరించే అవకాశాన్ని నాకు కల్గించారు చి॥శ్రీకాంత్.

**'నక్షత్రాలు ముట్టించిన మైనపు వత్తుల్లా వున్నా"**యంటూ అక్షర నక్షత్రాలను వెదజల్లి కొత్త కవితల్ని కాంతివంతం చేశారు వెంకట రత్నం గారు. ఉద్యోగ విరమనా నంతరం తన గదినే ప్రపంచంగా మార్చుకుని, గుండె గది నుండి ఎన్నో కవితలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

**"రాతే రచన కాదు**
**శబ్దమే రచన కాదు**
**నిశ్శబ్దమూ రచనే!"** (అక్షం`కేళి)

మౌనిలా ఉండే అడిగోపుల వారు సమాజాన్ని ఆవరించిన నిశ్శబ్దాన్ని శబ్దంతో బద్దలు కొట్టా రు. పక్క పక్కనే మనుషులున్నా రాజ్యమేలు తున్న మౌనానికి కొత్త భాష్యం చెప్పారు. ఆర్థిక విలు వలు అగ్రపీఠం మీదవున్నప్పుడు సకల విలువలూ దాస్యం చేస్తాయన్నారు. ఇది ఏ ఇజం నించో నేర్చుకున్నది కాదు; స్వీయా నుభ వంతో చెప్పిన సత్యం. అడిగోపుల వారు అనుభవంతో ఆవిష్కరిం చిన సత్యాలెన్నో ఈ సంపుటిలోని పుటల మధ్య పరచుకున్నాయి. అవి మనల్ని పలకరిస్తాయి.



ప్రతులకు:అడిగోపుల పద్మజ,
కావేరి రెసిడెన్సీ
ఆరోబిందోమార్గ్, ఎన్‌జిఓ
కాలనీ, తిరుపతి-517507

**కవిత్వంతో కరచాలనం చేసి, కలంతో కాలాన్ని జయించిన కవి. ఐదు దశాబ్దాలుగా కవిత్వం రాస్తున్నా అడిగోపుల వారి కలం దారి తప్పలేదు. పథం మారలేదు.**

మన లో కదలిక తెస్తాయి.

**"శాస్త్రీయత వృద్ధిచెంది చైతన్యం క్షయమైంది**
**వ్యక్తిత్వం కరువై మానవత్వం మరుగైంది"** అంటారు. (జేబులో జగతి) సైన్సు అభివృద్ధి చెందాక, మానవుడు యాంత్రికంగా మారాడు. సాంకేతికతకు బానిసై చైతన్యాన్ని కోల్పోయాడు. మనిషిలో చైతన్యం కరువైనపుడు, శాస్త్రం ఎంతగా పెరిగిన అది నిర్బంధ సుమమే! అడిగోపులవారు కవి హృదయంతో అటు సైన్సును– ఇటు మనిషికి ప్రాణమైన చైత న్యాన్ని సమతూకంగా అంచనా వేసి, చైతన్య వంతుడైన మనిషి వ్యక్తి త్వాన్ని కోల్పోవ డంతో, మానవత్వం కనుమరుగైందని ఆవేదన చెందారు.

**'యుద్ధాలన్నీ ఒకటి కాదు'** శీర్షికన రాసిన కవితలో వైయక్తిక యుద్ధాలు, సామాజిక యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాలు, పరోక్ష యుద్ధాలు ఇవాళ్టి సమాజంలో ఎలా సాగుతున్నాయో, సరికొత్త కోణం లో అడిగోపులవారు ఆవిష్కరించారు. చివరకు అపజయమో? జయమో? యుద్ధానికి రెండే ముఖాలుంటాయని కవితను ముగి స్తారు. అడిగోపుల వారి కవితకు ఎత్తుగడ, ముగింపు ఉచ్ఛ్వాస, నిశ్వాసలు. కవిత రాసే ముందు వస్తువు వైశాల్యాన్ని గుర్తించి, ఎలా రాస్తే కవిత పాఠకుల గుండె తాకు తుందో అడిగోపులవారు అంతర్ముఖులై ఆలోచిస్తారు. అంచనాకు వస్తారు. కలం కదుపుతారు. కవితై మెరుస్తారు.

అడిగోపుల వారి కవితల్లో ప్రధానమైంది వస్తువైవిధ్యం. వర్తమాన తరంలో కవుల్ని వెంటాడుతున్న వస్తు దారిద్ర్యం అడిగోపుల కలానికి లేదు. మనం నిత్యం చూసే సమాజంలో, మనకు కనిపించని అగాధాలను, ఆవేదన మూలాలను తవ్వి, కన్నీటి చెలమల్ని బయటకు తీస్తారు. **"అశ్రువీధిలో అగ్నిగానం"** విన్న అడిగోపుల వారు **'రాతి చిగుళ్ళు'**లో మానవతా రాగాన్ని ఆలకించి మనిషికి బాసటగా నిలుస్తారు. "మరణానికి రెండు ముఖాలు" ఒటాయని ప్రప్రథమం గా గుర్తించిన కవి అడిగోపుల వారు. సమకాలీన కవులందర్నీ చదివిన అడిగోపుల ఏ కవినీ అనుకరించలేదు. అనుసరించలేదు. ఏ కవికీ నీడగా మార లేదు.

**అడిగోపుల వెంకటరత్నమ్ రచన "అక్షరాలు మొలకెత్తుతూనే ఉంటాయి" పుస్తకానికి డా॥బీరంసుందరరావు రాసిన ముందు మాట.**

తనదైన కవన మార్గాన్ని నిర్మించుకున్నారు. వాక్యనిర్మాణంలో దాపరికం లేని శైలిని, పదాల పొందికతో పద చిత్రాలను నిర్మించే శిల్పాన్ని సృష్టించుకున్నారు. ప్రాచీన కవుల్లో తిక్కన పద్యంలా, ఆధునికుల్లో శ్రీశ్రీ, శేషేంద్ర, నారాయణరెడ్డి వచనంలా అడి గోపుల వారి కవితను ఇట్టే గుర్తించవచ్చు. కవి చిరునామా అతడి కవిత్వంలోనే వుంటుంది. కవిగా అడిగోపుల వారి దృష్టి, సృష్టి వారి కవితల్లో కన్పిస్తుంది. కుందుర్తి తర్వాత వచన కవిత్వాన్ని సామాన్యుడి చెంతకు చేర్చిన కవి అడిగోపుల. దువ్వూరి, ఏటుకూరి, తుమ్మల వంటి కర్షక కవుల గ్రామీణ పదబంధాలన్నీ అడిగో పుల కవిత్వంలో సరికొత్త పదచిత్రాలై కాంతులీనాయి.

**"పొలం పలకపై**
**నాగలి సరళరేఖలు గీసింది"**
**"మనిషికి మరో రూపమే విశ్వ రూపం"**

మనిషి పుస్తకమయ్యాక గ్రంథాల యం మనిషైంది.

**"తారురోడ్డు పెనంపై**
**కాళ్ళు దోసెల్లా కాలుతు న్నాయి"**
**"మనిషికే కాదు**
**భూమికీ మరణముంటుంది"**
**"వర్తమానం, భవిష్యత్తులు కాలం ఒడిలో కవల పిల్లలు"**
**"సముద్రాన్ని తాగి**
**మేఘాలు బరువెక్కాయి"**
**"స్వర్గానికి నరకం సామంత రాజ్యం"**
**"నాగటికర్రు నేలను గాయ పరిస్తే గాదెలు నిండుతాయి"**

ఇలాంటి పదచిత్రాలు, సరి కొత్త అభివ్యక్తులు అడిగోపుల వారి కవితల్లో ప్రతిపుటలోనూ పలకరిస్తాయి. కవి గొప్పతనం కవిగా అడిగోపుల వారికి తెలుసు కనుకనే–

**"అక్షరాల్ని పోగేసుకున్న కవి**
**కాగితంపై నల్లని లిపితో**
**ఎఱ్ఱెఱ్ఱని మంటలు పుట్టిస్తాడు**
**మాటరాని నాలుకపై**
**బీజాక్షరాలు మొలిపిస్తాడు"** (రేపటి జ్ఞాపకం) అంటారు.

**"అడిగోపుల వెంకట రత్నం రాసే వాక్యం, విన్పించే సందేశం, ఉద్యమంగా మారి జనసంద్రా లను కూడగడతాయి. మెదడులో విచ్చుకునే ఆలోచనలు మగత లోంచి విడివడే చూపుల్ని మనిషికి అందజేస్తాయి. మారిన ఇతివృ త్తాల మధ్య, మారని వ్యధాభరిత చిత్రాలు మన కళ్ళకు కన్పిస్తాయి"** అంటారు ప్రముఖ సాహితీవేత్త, కవి రావెల సాంబశివరావు గారు. అడిగోపుల వారిని దగ్గరగా చూచి, వారి భావజాలంతో ఏకీభవించిన ఆత్మీయుల్లో రావెలవారు ముఖ్యులు. వీరిద్దరి సాన్నిహిత్యం సాహిత్య సృష్టికి, భావ పరిపుష్టికి వేదికయింది.

అడిగోపుల వారి **'మహాపథం'** కవితా సంపుటికి రాసిన ముందు మాటలో మా గురుదేవులు, ప్రఖ్యాత కవి డా॥నాగభైరవ గారు "అడిగోపుల కవిత్వం జోకొట్టేది కాదు. గుండెల్లో జేగంటలు మోగించి, చైతన్యానికి జేకొట్టేది. వెంకట రత్నం కవితల్లో అనుభవం పండిన అమ్రఫలపు రుచి వుంది. గుండెల్లో పొంగిన భావ తీవ్రత వుంది.అడిగోపుల కలానికి విల్లంబు గురి వుంది. వైవిధ్యపు సిరి వుంది. గురి గమ్యానిది. సిరి రమ్యా నిది" అని వారి కవిత్వ, వ్యక్తిత్వాలను బొమ్మకట్టి చూపారు.

ఈ సంపుటిలో గదినిండా ప్రపంచం, నీడ కీర్తిశేషమైంది. తూర్పు పడమర, ఊరబావి, కవి నడిస్తేనే చాలదు, తాత మనవడు, అడుగు జాడలు, నడుస్తున్న చరిత్ర వంటి కవితలు అడిగోపులవారి అభివ్యక్తి నవ్యతకు ఆటపట్లు.

మూడు దశాబ్దాలకుపైగా కవిత్వాన్ని ప్రచురిస్తున్న అడి గోపుల వారు, కవిత్వంలోనే కాదు, ముద్రణలోనూ, నవ్యతకు, నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చారు. వారి కవితా సంపుటాల్లో అట్టహాసం ఎంత ముఖ్యమో, అక్షర దరహాసం అంతే ముఖ్యం. అందుకు ప్రధాన కారకులు చి॥ అడిగోపుల శ్రీకాంత్. తాను కవి కాకపోయినా కవి హృదయం తెలుసు. తమ తండ్రి కవిత ల్లోని లోతుల్ని గుర్తించి అందమైన గీతలతో ముఖ చిత్రాల్ని గీసి ఇంద్ర ధనసుల్లా విప్పారేలా చేశారు. తండ్రి కవిత్వానికి కొడుకు ముఖచిత్రం కావడం కవి శివారెడ్డిగారి తర్వాత శ్రీకాంత్‌కే ఆ అదృష్టం దక్కింది. పుస్తకం అచ్చు కాగానే తమ అందమైన దస్తూరితో నాకు పంపడం, అభిప్రాయం రాయమనడం మన అడిగోపుల వారి ఆనవా యితీ, ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ శ్రీకాంత్ తమ తండ్రి అడిగోపుల వారి చివరి పుస్తకానికి ముందు మాట రాయమని అడిగారు. అంతకుముందే అడిగోపులవారు నన్నడిగారు. నా **'ముందు మాట'** చూడ కుండానే ముందుగానే వారు వెళ్ళిపోవడం కుటుంబానికీ, నాలాంటి అభిమానులకూ తీరని లోటు.

గుంటూరు వాసుల గుండెలపై కవిత్వ సుగంధాన్ని కుమ్మరించిన అడిగోపుల వారు తిరుపతి చేరాక, నిత్యం కవిత్వమై నన్ను పలకరిస్తూనే వుండేవారు. వయసు పైబడుతున్నా, అలుపెర గకుండా, చివరి శ్వాస వరకు రాస్తూనే వున్నారు. తమ గుండె వాకిలికి కవిత్వ తోరణాలు కట్టి **'కొత్తగాలి'** ని స్వాగ తించారు. కొత్త ఉదయాల్ని భుజం తట్టారు. కవిత్వం పేరుతో అస్పష్టత, అర్థంకాని ప్రతీకలు పాఠకుల్ని అయోమయానికి గురి చేస్తున్న కాలంలో అడిగోపులవారు వ్యంగ్యాత్మ కమైన శీర్షికలతో, వస్తు వైవిధ్యంతో కొత్తదారులు వేసి, విలక్షణ కవిగా నిలిచారు. తను నమ్మిన నిజాయితీ ఇబ్బందులకు గురిచేసినా, ఆత్మస్థైర్యం తో అడ ుగులు వేసి, కడపటి విజేత మనిషేనని నిరూపించారు. వేదికలకు, వివాదాలకు, నినాదాలకు దూరంగా నిరాడంబరంగా నిలిచారు. కవికి జననమే తప్ప మంణం లేదని అక్షరాలా చాటారు. వారి మాటల్లోనే–

**"మనిషి మరణించాక మాట ఉండదు**
**బోధనలు వినిపిస్తాయి**
**నడకలుండవు అడుగుజాడ లుంటాయి"**

ఇపుడు మనం చెయ్యాల్సింది అడిగోపుల వారి అడుగుజాడల్లో నడవడమే! ఆకలి దప్పులు లేని, అన్యాయాలు లేని లోకాన్ని ఆవిష్కరణ చేయడమే వారికి నిజమైన నివాళి.

**"రోజులు గడపడం**
**జీవనం కాదు**
**రోజుకో చరిత్ర**
**సృష్టించడం జీవితం"**

నిజాయితీపరుడైన ఉద్యోగిగా, నిర్భయగళంతో కలం కదిలించిన కవిగా ఆదర్శప్రాయుడైన తండ్రిగా, అందరినీ ఆత్మీయంగా పలకరించే స్నేహశీలిగా అడిగోపుల వెంకటరత్నం గారు సాహిత్య చరిత్రలో తనకో పేజీని రిజర్వు చేసుకున్నారు. శ్రీ కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారి వంటి విమర్శకులు అది నిజమేనని తమ విశ్లేషణల్లో చెప్పారు. రూపంగా దూరమైనా కవితా దీపంగా అందరి గుండెల్లో వెలుగుతున్న అడిగోపుల వారికి ఆత్మీయ అక్షరాంజలి.



–డా॥బీరం
సుందరరావు
6303443302

# కథా రచయితలకు మార్గదర్శకాలు చాసో కథలు

తెలుగు కథకు దిశానిర్దేశం చేసిన కొద్ది మంది ప్రముఖులలో చాసో ఒకరు. తెలుగు సాహిత్యంలో 'కథకులకి కథకుడు' అని పేరు ఆయన పేరెన్నిక గన్నారు. చాసో పూర్తి పేరు చాగంటి సోమయాజులు. **"ఏలూరెళ్ళాలి ' "వాయులీనం" "కుంకుడాకు" "కుక్కుటేశ్వరము"** చాసో పేరు చెప్పగానే మొదటగా గుర్తొచ్చే కథలు. ఈ నాలుగు కథలు ప్రధానంగా పేర్కొన్న బడినా, 1943–79 మధ్య కాలంలో చాసో రాసిన కథల నుంచి ఎంపిక చేసిన నలభై కథలతో విశాలాంధ్ర సంకలనం 'చాసో కథలు పేరున వెలువరించింది. మళ్ళీ మళ్ళీ చదువుకునే కథలు ఇవి. కొత్తగా కథలు రాయాలనుకునే వారికి చాసో కథలు మార్గదర్శకాలు. ఒక కథకు మరో కథకు ఏ మాత్రం పోలిక పరంగా సంబంధం లేక పోవడమనే అంశం ఆయనను గొప్ప కథకుడిని చేసింది.

చాగంటి సోమయాజులు ( 1915, జనవరి 15 – 1994 జనవరి 1) ప్రముఖ తెలుగు రచయిత. ఆయన మొట్ట మొదటి రచన "చిన్నాజీ" 1942లో భారతి పత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత ఎన్నో కథలు, కవితలు రాశారు. ఆయన రాసిన కథల్లో పీడిత ప్రజల బాధలు, సమస్యలు, సమకాలీన వ్యవస్థ అయన రచనలో ప్రధానంగా ఉన్నాయి. ఆయన రాసిన చాలా కథలు హిందీ, రష్యన్, కన్నడ, మరాఠీ, మలయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించబడ్డాయి. 1968లో చాసో కథలుగా పుస్తక రూపంలో చాసో కథా సంకలనం వెలువడింది.

1915 జనవరి 15 న శ్రీకాకుళంలో జన్మించిన చాగంటి సోమయాజులు తల్లితండ్రులు కానుకొలను లక్ష్మీనారాయణ శర్మ, తులసమ్మ. తర్వాత పెదతల్లి తులసమ్మకు దత్త పుత్రునిగా విజయ నగరం వెళ్ళారు. చాసో అయిదో ఫారం వరకు శ్రీకాకుళంలో చదివారు. విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేసి మహారాజా కళాశాల విజయ నగరంలో పై చదువులు చదివారు.

కళాశాల విద్యార్థిగానే ఆయన కవితా రచనకు శ్రీకారం చుట్టారు. తోరుదత్, సరోజినీ నాయుడుల కవిత్వం, లియో టాల్‌స్టాయ్, మాక్సిం గోర్కీల కళాత్మక వ్యక్తీకరణ, ప్రగతిశీల మార్క్సిస్టు దృక్పథం చాసోను ప్రభావితం చేశాయి. సృజనాత్మక ప్రక్రియలైన కథ, కవిత్వం, రెండింటినీ దాదాపు ఒకే సమయంలో వ్రాస్తూ వచ్చినా, తర్వాతి కాలంలో ఆయన కథా రచనకే ప్రాధాన్య మిచ్చారు. అచ్చయిన చాసో తొలి కవిత 'ధర్మక్షేత్రము' (భారతి : 1941 జూన్), కాగా తొలి కథ చిన్నాజీ (భారతి: 1942). చాసో కథల రెండో కూర్పు విశాలాంధ్ర ప్రచురణాలయం 1983లో ముద్రించింది. ఇందులో మొత్తం 40 కథలున్నాయి.



**"ఆయన రాసిన కథల్లో పీడిత ప్రజల బాధలు, సమస్యలు, సమకాలీన వ్యవస్థ అయన రచనలో ప్రధానంగా ఉన్నాయి. ఆయన రాసిన చాలా కథలు హిందీ, రష్యన్, కన్నడ, మరాఠీ, మలయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించబడ్డాయి"**

అభ్యుదయ రచయితల సంఘం స్థాపించిన వారిలో చాసో ఒకరు. ఆయన నిత్యజీవితంలో చాలా ఆదర్శాల కోసం పనిచేసారు. అభ్యుదయ సాహిత్యోద్యమ వేదిక, అభ్యుదయ రచయితల సంఘం మొదటి మహాసభలు తెనాలిలో 1943లో జరిపారు. కన్నుమూసే వరకూ ఆయన 'అరసం'లోనే ఉంటూ కార్యకర్తగా నాయకునిగా తెలుగునాట అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి విశేష సేవలందించారు.

చాసో 1994 జనవరి 1 న మరణించారు. మరణానంతరం తన భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం ఇమ్మని కోరటం ఆయన అభ్యుదయ జీవన దృక్పథానికి నిదర్శనం.

చాసో కథల్లో ఉన్న మనుషులకి అంటే ప్రధాన పాత్రలకి ఆవేశాలుండవు; కామం, ప్రేమ, ఈర్ష్య, క్రోధం, ఇలాంటి ఉద్రేకాలుండవు. వాళ్ళు ఏ కోరికకీ లొంగిపోరు ఒక్క బతకాలనే కోరిక తప్ప. మనిషి సుఖంగా బతకాలంటే ఏం చెయ్యాలో చాసో పాత్రలు అన్యాపదేశంగా వివరిస్తాయి. సుఖం దానంతట అది రాదు. సుఖం నువ్వు చేసుకునేది. అది అదృష్టం వల్లో, మరో సదుపాయం వల్లో వచ్చే వొస్తువు కాదు. ఆలోచనల వల్ల, లౌక్యం వల్ల, చాకచక్యం వల్ల మాత్రమే సౌఖ్యం సాధ్యం. నీతి, స్నేహం, న్యాయం, ధర్మం ఇవి నిజాలు కావు. కాని ఇవి ఉన్నాయని తెలివితక్కువ వాళ్ళు నమ్ముతారు. అవి నిజంగా ఉన్నాయని నువ్వు నమ్మేవో నువ్వూ లోకంలో నానా కష్టాలూ పడే వాళ్ళలో చేరిపోతావు. ఇలా చాసో కథలలో పాత్రల ద్వారా చెపుతారు.

తెలుగు కథా విమర్శకులలో చాసోని మెచ్చుకున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. వేళ్ళ మీద లెక్కపెట్ట దగిన పదిమంది తెలుగు కథానికా రచయితలలో చాసో పేరుంటుందని రోణంకి అప్పలస్వామి కితాబిచ్చారు. తెలుగు మరిచి పోయినప్పుడే చాగంటి సోమయాజులుని మరిచి పోవడ మని ఆరుద్ర పేర్కొన్నారు.

(1915, జనవరి 15–1994 జనవరి) కథకులకు కథకులు చాగంటి సోమయాజులు జయంతి సందర్భంగా....)



–రామ కిష్టయ్య
సంగన భట్ల
9440595494

# ఉపకారం పిల్లలకే!

**చిన్నచెంబుతోటి శీకాయ**
**ఉదకంబు**
**అవ్వనాకు ఇంత**
**బువ్వవెట్టు**
**బువ్వలేదు కొడుక**
**బుద్ధిమం తుడవైతె**
**చల్లత్రాగిపోరా!**
**చదువుకోర!**

మా చిన్నతనంలో ఈ పద్యం ఇంట్లోనూ– బడిలోనూ విన్నాం. అన్నం లేకున్నా నరేగాని చదువు మానుకోరాదన్న సందేశాన్నిచ్చే పద్యం చిన్న పిల్లల నిమిత్తమే. పెద్ద వాళ్లెవరో చెప్పింది. అంతేగాక ఈ క్రింది పద్యమైతే చదువు ప్రాశస్త్యాన్నే గాక పద్యాల ప్రాధాన్యాన్ని వివరించేది!

**కం. తేరా! పలకా బలపము**
**ఈరా! అయవారి చేతికింప లరంగా**
**పోరా! భోజన వేళకు**
**రారా! పద్యాలు చదువ రాజకు మారా!**

ఇది కేవలం అబ్బాయిల పద్యంగా కనిపిస్తే తేవే, ఈవే, పోవే, రాలే, రాజకుమారీ అని ఇందులోని పదాలను మార్చుకొంటే ఇది అమ్మాయిల పద్యమై పోతుంది.

ఇలాంటి పద్యాలు చెప్పడమే, గ్రామాల్లో, వీధుల్లో జరిగే ఉత్సావాల్లో, గుడిబడి కార్యక్రమాల్లో పాల్గొన్నవారు ఏదైనా చెప్పేప్పుడు పద్యాలు ఉదాహరించేవారు. మరి భజనల్లో తప్పనిసరిగా ఒక కీర్తన తర్వాత ఓ పద్యం ఎవరైనా చదివేవారు.

ఆ పద్యాలు భారత– భాగవత– రామాయణాల్లోనివే కాక శతక పద్యాలు కూడా ఉండేవి. ఆ శతకాలు సర్వసాధారణంగా సుమతీ, కృష్ణా, వేమన, నరసింహ, దాశరథి మొదలైనవి. కొందరు ఆ పద్యాలు విని అర్థాలు – పరమార్థాలు తెలుసుకోవ డానికి ప్రయత్నించేవారు. ఆ పద్యాలు వినే బాలబాలికలకు నేర్చుకోవాలనే ఆసక్తి కలిగేది.

**అనగననగ రాగమతిశయిల్లుచు నుండు/ తినగ తినగ వేము తియ్య నుండు/ సాధన మున పనులు సమ కూరు ధర లోన–** అనే పద్యం పిల్లలకు, పెద్దలకు వచ్చేది. ఇది పనిచేయాలనే భావన అందరిలో కలిగించేది.

కాలం ఖర్మం కాలి తెలుగు నాట పద్యంపై ఓ అర్ధశతాబ్ది క్రిం దనే కొందరు విరుచుకు పడ్డారు. సంప్రదాయాన్ని వ్యతిరేకించే ఉద్దేశంతో పద్యాన్నీ వ్యతిరేకించారు.

కాని శతకపద్యాల్లో సామాజికాంశాలు, నైతిక విలువలు, మానవతా మూల్యాలు, సాంస్కృతిక సంపద, నిర్మాణశైలి...

ఇలా ఎన్నో అంశాలు పద్యాలకు జీవం పోస్తూనే ఉన్నాయి. ప్రాచీన శతకాల ప్రభావంతో వారా నికో కొత్త శతకం పుట్టుకొని వస్తున్నది.

ఇంత నేపథ్యంతో కొన్ని శతకాలను తాత్పర్యంతో పాటు ప్రచురించాలనే నిర్ణయం తీసుకొన్నారు మిత్రులు శ్రీ కడియాల ప్రభాకరరావు గారు. సుమతి, వేమన, భాస్కర, దాశరథి, శ్రీకాళ హస్తీశ్వర, నరసింహ శతకష ట్కాన్ని ఒక గ్రంథంగా అంది స్తున్నారు. తాత్పర్యంతో ప్రచురించడాన్ని తప్పకుండా ఆహ్వానిం చాల్సిందే!

వీటి అధ్యయనం వల్ల, ధారణ వల్ల బాలబాలికలకే కాదు నేర్చుకొనే అందరి లోనూ తెలుగు భాషాభి మానం పెరుగుతుంది. సమాజ విషయాలు తెలుస్తాయి. నైతిక విలు వల ఆవశ్య కత అర్థమవు తుంది. సర్వమానవ సమా నత్వ భావననే కాదు, సర్వ ప్రాణి సమానత్వ భావనవైపు మనసు మొగ్గుతుంది. మాన వతా మూ ల్యాలు ప్రజాస్వా మ్య విలువలూ ప్రచారమవు తాయి. ఉపకారికి ఉపకారము అన్న పద్యంలోని పర మార్థం తెలిసే విధంగా ఈ పుస్త కాన్ని ప్రచురించి శ్రీ కడియాల వారు గొప్ప ఉపకారం చేశారు. ఇంకేం అందరం చదువుదాం! బహుళ ప్ర యోజనాలు పొందుదాం!!






ప్రతులకు:కడియాల
ప్రభాకరరావు
సెల్:

**కడియాల ప్రభాకర్ రావు రాసిన "శతక షట్కము" పుస్తకానికి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి రాసిన ముందు మాట**



–ఆచార్య కసిరెడ్డి
వెంకటరెడ్డి



అవధానం అమృతవల్లి రచించిన **"మట్టి చివురు"** కవితా సంపుటికి డా॥కె.జి.వేణు రాసిన ముందు మాట...



# మట్టితో ఒప్పందాలకు సంతకాలు చేస్తున్న కవిత్వం

మేఘాలతో కవిత్వాన్ని ఆకాశం పలికిస్తుంది. వాన చినుకులు మట్టి కణాలతో కవిత్వాన్ని పంచుకుంటాయి. చెట్టుకున్న ఆకులను కాగితాలుగా మార్చి, గాలి కవిత్వాన్ని రాస్తుంది. సముద్రం తన అలలమీద పొంగుతున్న నురగాలను కవిత్వ పంక్తులుగా మార్చుకుంటుంది. ఎండిన పొలాల్లో దీనంగా నిలబడ్డ రైతన్న నేత్రాలు అందిస్తున్న కవిత్వానికి కష్టాలే వ్యాకరణంగా మారుతాయి. ఎన్నికలొస్తే వాగ్దానాల కవిత్వం ఏరులై పారుతుంది. నాన్న చెమట చుక్కల కవిత్వం ఎప్పుడూ త్యాగాల సువాసనలను మోస్తూనే వుంటుంది. బిడ్డకు లాలపోసి తల్లి ముద్దుపెట్టిన ప్రతిసారి ఓ కవితా సంపుటి వెలువడుతూనే వుంటుంది. ఏకాంతంలో భార్యా భర్తల మధ్య ఉప్పొంగే కవిత్వం, అక్షరాలకు అందని సరిహద్దులు దాటిన మైకాన్ని అందిస్తూ వుంటుంది. జననం, మరణం ఈ రెండూ కవిత్వాలే. చెప్పాలంటే మనిషి జీవితం ఓ పెద్ద దీర్ఘ కావ్యం. ఇవన్నీ ఎవరి ప్రమేయాలతో సంబంధం లేని సహజ సిద్ధ స్వయంభూ కవితలు. వీటిని నిత్యం అధ్యయనం చేసే అభ్యాసం కొందరికే సాధ్యం. ఆ మనుషులు రాసే కవితల్లో మాత్రమే సంపూర్ణమైన జీవం, అసలైన సాహిత్యం తరాలదాకా కొనసాగుతుంది.

సుదీర్ఘ కాలంగా చాలా ఇష్టంగా సాహిత్యంతో సహవాసం చేస్తున్న **'అవధానం అమృతవల్లి'** అందించిన కవితా సంపుటి **'మట్టి చివురు'**. దీని నిండా జీవితం సంతకం చేసి సొంతం చేసుకున్న అనుభవాల భావాలన్నీ అక్షరాల పందిళ్ల క్రింద పాఠకుల్ని పలకరిస్తూ వున్నాయి. వరదలా సాగిపోతున్న ఇందులోని కవితా ప్రవాహం, మనల్ని తాకిన వెంటనే ఆవిరై పోవడం లేదు. పుట్టుమచ్చలా ఒక శాశ్వత ముద్రకు సిద్ధపడుతోంది. మా టామంతి కలిశాక కవితలన్నీ మనతో స్నేహితుల్లా కలిసిపోతున్నాయి. అవసరమైనప్పుడు కలబడుతున్నాయి. కబుర్లు చెప్పుతున్నాయి. కవితలు కన్నీరుగా మారిన ప్రతిసారి అందులో ఎందరో బాధితుల ప్రతిబింబాలు కనబడుటం విశేషం. ఆ వెంటనే మన గుండెల మీద ఏదో తెలియని అలజడి ప్రారంభమవుతోంది. మట్టిని నమ్మిన బ్రతుకులు మన ముందుకు వచ్చి, శవాలుగా మారిన ఆశల్ని భుజాల మీద మోస్తూ, ఆలపించిన శోక గీతాలు రాళ్ళను సైతం ద్రవింపజేస్తున్నాయి. సూ ర్యుడు ముఖంచాటేసిన సమయాలన్నీ గ్రహనాల ను మోసిన రోజుల్ని గుర్తు చేసుకుంటున్నాయి.

**'మొలకల పేరంటానికి.. వెల్లువల సయ్యాట'** కవిత నిండా కవిత్వం పచ్చకర్పూరపు వాసనలు అందిస్తోంది. సముద్రం ఆరేసుకున్న చీర అంచులు అక్షరాల వెండితీగలతో తళుక్కుమంటున్నాయి. రాలుతున్న చినుకులు చేతులు పట్టుకుని విత్తనాలకు పురుడు పోస్తున్న దృశ్యం పెద్దనా మాత్యుని పద్యంలా వెలిగిపోతోంది. మానవ తప్పిదాల చిట్టాలను విప్పిన కవిత్వంలో దుర్మార్గపు మనుషులు చేసిన దుస్సాహస వికృత రూపాలు, దయ్యాల్లా మీదికి దూసుకు వస్తున్నాయి. జీవితంలో అలసత్వాన్ని వీడమంటూ ఓ స్వరం జనాన్ని హెచ్చరించడాన్ని ఇక్కడ మనం గమనించవచ్చు.

**'ఆమె మది గది దాటని మహిళ**
**ఏళ్లు గడుస్తున్నా నిద్దురను వీడని ఊర్మిళ**
**ఎన్ని సంఘర్షణలున్నా మాట రాని శిల**
**వేల గొంతుల బాధలను మౌనంగా పాడుతున్న కోయిల..."**

అంటూ ఈ నేల మీద మొదటి శాపగ్రస్తురాలైన స్త్రీ జీవితాన్ని నోరెండిన నేల తల్లి సాక్షిగా అందించిన **'అవ్యక్త గీతిక'** కవిత నేరుగా వచ్చి కన్నీళ్లతో పాఠకులను తన గుండెకు హత్తుకుంటోంది. ఎదురుగా నాన్న నిలబడి వున్నాడు. కొలిస్తే, లోకంలో అన్ని ఎత్తులలోనూ అతి ఎత్తయిన మనిషి ఎవరంటే అన్నిట్లోనూ నాన్నే తేలుతున్నాడు. నాన్న అంది ంచిన ఆత్మగౌరవ ఛత్రమే మన జీవిత క్షేత్రాల మీద మనల్ని అజేయులుగా నిలబెట్టగలుగుతోంది. ఈ భావనను అందిం చిన **'నాన్న నా విజయకేతనం'** కవిత, నాన్నకు మరోసారి మనసారా సాష్టాంగ నమస్కారం చేసి నట్టుగా వుంది.

వైద్యనారాయణుడ్ని ఊపిరి పూలను అందించే నేతగాడిగా **"ఊపిరి నేతగాళ్లు"** కవితలో అభివర్ణించిన మాటలు బంగారు మూటలై సాహిత్యపు ఖాతాల్లో చేరుతున్నాయి. గాజు తెరల పలకరింపుల్లో గుండె చెమ్మకై ఎదురుచూస్తున్న జీవితాలలోని బీడు ఆశలు, జీవితమంతా గబ్బిలాల్లా వేలాడుతున్న దృశ్యం, కలవరపెడుతోంది. దాని ముందు మనిషి వాసన లేని ఆకారాలు వాకింగ్ డెడ్‌గా కోకొల్లలు తచ్చాడటం చూసి బంధాల కట్టడాలన్నీ ఒక్క సారిగా నేలమట్టానికి చేరుకుంటున్నాయి. ఊరి పొలిమేరలు ఉన్నట్టుండి ఉలిక్కిపడేలా చేసిన కవితలోని ఈ భావనలు, అనుబంధాల కొమ్మపై మనిషి వాలుతున్న దృశ్యాలను చూపిస్తూ, **'మహోజ్వల ఉదయం కోసం ఎదురు చూస్తున్న చూపుల నుండి అంత సులభంగా మనం బయట పడలేం..'** అంటూ ఈ పదాలు ఒక తాత్విక తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాయి. **'గంగిరెద్దుల మేళాలు, బసవన్నల బండలాగుడు పోటీలు/ బంతి పూల పలకరింపులు/ అన్నిట్లో తన చిరునామా/ ఉందని సంబరపడతాడు..'** అంటూ బడుగుజీవి పాదాలను గంగాజలాలతో అభిషేకిస్తూ, అతడు ఎప్పటికీ గతి తప్పని సంక్రమణ సూరీడై నిలుచునే వుంటాడని ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసిన **'కలగంటూనే ఉన్నాడు'** అనే కవిత, పాలబువ్వ లాంటి కవిత్వాన్ని మనకు అందిస్తోంది.

**'నువు ఆత్మవిశ్వాసపు అల్లెతాడును విడువబోకు/ చిరునవ్వుల సమాధానాల్ని పరుచుకుంటూ వెళ్లు...'** అంటూ పలికిన **'మనసు తెలిసి మసలుదాం'** కవితలోని పాదాలన్నీ మనిషి బ్రతుకుకోసం పూలదారుల్లా మారిపోతున్నాయి. పడమటి పొద్దులో ఒంటరితనం ముల్లు గుచ్చుడం ఎవ్వరికీ కనిపించదు. కానీ గుండెల్లో పెట్టే ఎడతెగని సలపరాన్ని సాధికారికంగా వ్యక్తం చేసిన ఈ సందర్భం మాత్రం, కొత్త చివుళ్లకు స్థానం కల్పిస్తూ, పాతకుల్ని బడిపిల్లల్ని చేసి పాఠాలు బోధిస్తోంది. గుప్పెడు మట్టినీ మిగుల్చుకోలేని స్వార్థపు మనిషిని ఈ సంపుటి సాక్షిగా బోను ఎక్కించి **'నేల సమతూకానికి తూట్లు పొడిచి గుండె లో గునపాల్ని దించే గుణహీనుడా, వృక్ష జాతిలేని భూమిపైకి మరో కొత్త ఊపిరిని ఆహ్వానించే హక్కు నీ కెక్కడదని.. అంటూ కురిపించిన ప్రశ్నల వర్షంలో మనం కూడా తడుస్తూ ఉలిక్కిపడుతున్నాం. కన్నుల భాషలు చదువగలిగే కమనీయ కావ్యం/ ఇరువురి శ్వాసలు ఒకే స్వరంగా పలికే హృదయ వేణుగానం..** అంటూ నమ్మకమే పునాదిగా వెలసిన కోవెలలో వెలిగే దీపంగా మూడుముళ్ళ బంధాన్ని **'జీవన వేదం'** కవితలో ఆవిష్కరించిన తీరుకు, కోటి వీణల స్వరాలు నేపథ్యంగా మారుతున్న క్షణాలివి.

కనురెప్ప వాకిట సిపాయిలా నిల్చున్న గీతాలను చెలిమి చిరునామాలుగా తర్జుమా చేస్తున్న సరికొత్త భాషా సౌందర్యాన్ని **'మనమొక్కటేనని..'** కవిత తన పేజీలనిండా నింపు కుంటోంది.

మనకబారిన కంటిచూపు జ్ఞాపకాలలో చిరుగుల చొక్కాతో బాల్యం సరదాలన్నీ, కుంకుడు చెట్టు కాయలను నూరి చెంబులో వేసి గడ్డిపుల్లతో నురగపై ఊదిన రంగు బుడగల్లా తిరిగి వృద్ధాప్యం ముందు వాలిపోతున్నాయి. నదికి ఆవల గోరింట చెట్టు కింద బండలపై నూరిన ఆకు వండిన గుర్తుల్ని **'బాల్యపు సంచీ'** కవిత తన పట్టువస్త్రాలుగా మార్చుకుంటోంది. చెంపలపై కుంపుల్ని పూయించే నవ్వుల రథాన్ని ఎక్కి ఊరేగమని మార్చుకుంటోంది. చెంపలపై కెంపుల్ని పూయించే నవ్వుల రథాన్ని ఎక్కి ఊరేగమని ఆహ్వానిస్తున్న సౌభాగ్యం ముందు **'నవ్వగలగడం ఒక భోగం/ నవ్వించగలగడం ఒక భాగ్యం/ నొప్పించని నవ్వుదెప్పుడూ కరచాలనమే/ అపహాస్యపు నవ్వుల కెపుడూ సంకెళ్ళ ఆహ్వానమే..'** అంటూ ఎంతటి దుఃఖానయినా తరిమివేసే మంత్రపు జల్లులైన నవ్వుల్ని మనసు బావిలో ఊరే హాస్యజలాలుగా అభివర్ణించిన **"చెంపలపై పూసె కెంపులు"** కవిత పాఠకుడి ఆనందాన్ని రెట్టింపు చేస్తోంది. కవిత్వానికి కోపం వస్తే ఆ రుద్రరూపం ఎలా వుంటుందో చూడాలనుకుంటే మనం **'తేల్చు కోవాల్సిన క్షణమదే!'** కవిత ముందు నిలబడవలసిందే. **'జన్మస్థానాన్ని మకిలి చేసిన కీచకులపై/ రాబంధుల రెక్కల దప్పులు మ్రోగించే రోజు/ అట్టే దూరం లేదని తెలుసుకో..'** అంటూ మాన ప్రాణాల్ని సమూహికంగా సమాధి చేస్తున్న ఉన్మాదాల జాతిని తీవ్రంగా హెచ్చరిస్తున్న ఆ స్వరపేటిక పలికిన ప్రతిపదం అణుబాంబుల శక్తికి ఒక స్థావరంగా తన ఉనికిని చాటుకుంటోంది.

జీవించడమంటే నిరంతర పోరు సల్పడమేనని గుర్తుచేస్తున్న **'మడి నేర్పిన పాఠం'** కవిత, తన చేతిలోని ఎన్నో అధ్యాయాలను పరిచయం చేస్తూ.. ఎన్నో ధర్మ సూక్ష్మాలను తీర్థంలా అందిస్తోంది. రుతుపవనాలు ఎటో వెళ్లిపోయాయి.'' కాలుష్యాన్ని పెంచి పోషిస్తున్న మనిషిని భగ్గున మాడి మసైపొమ్మని శపిస్తున్నాయి. మసిగా మారిన అందరి ముఖాలు ఇప్పుడు ఒకేలాగున్నాయి. ప్రకృతి సహజ నియమాల్ని తుత్తినియలు చేస్తున్న మనుషులే రేపటి భవిష్యత్తు, ప్రాణ వాయువు కోసం ప్రాకులాడే అవస్థలను నిజాల తెరమీద ఒక చలనచిత్రం లా ప్రదర్శిస్తున్న కవిత **'శపిస్తూ'**. నేలమ్మ రెప్పల చూరునుండి జారిన ఒక్కొక్క కన్నీటి చుక్కను అక్షరాలుగా మార్చి అందించిన కవిత **'పొల్లుపోతోందని..''** విలువైన పచ్చని సంతకా లం కోసం గొంతెత్తి అరు స్తోంది ఈ కవిత. నిటారుగా నిలబ డాల్సిన మనిషి, ముఖానికి నిండుగా ముసుగు కప్పు కుని, **'ముఖ'** పుస్తకాల వెలుగుల్లో మరుగుజ్జయి వంగిపోతూ, కంటతడి ఎరుగని శిలాకృతికి తన జీవితాన్ని తాకట్టు పెట్టుకుంటున్న వింత పోకడల కు **'శిలకు ప్రతి రూపమై'** కవిత, ఒక ప్రతిబింబంగా నిలుబడుతోంది.

**'జీవన సౌందర్యం అమ్మభాష'** ఈ కవితలో ఈ మాటను ఎన్ని సార్లు స్మరించుకున్నా మనకు తనివితీరుదు. **'పద్యము గద్యమూ పమిటలా చుట్టుకుని/ పాటనూ మాటనూ సిరిమువ్వలుగా కట్టుకుని/సంగీత సాహిత్య స్వర జతులను పలుకుతూ/ విస్వయని కపైన విహరించు కావ్యనర్తని నా తెలుగు..'** అంటూ మాతృభాషను కీర్తించిన ఈ కవిత తెలుగు భాషను పూలపల్లకీలో కూర్చోబెట్టి మరోసారి దేశమంతా ఊరేగించి నట్లుగా వుంది.

భాషో ద్యమపితా మహుడు, నాల్కలపై వ్యావహా రికమే నర్తించాలన్న స్వాప్నికుడు గిడుగు వారిని **'తెలుగువారి భాగ్యవశమున అందివచ్చిన అదృష్టము'** అంటూ ఆ కారణజ న్ముడి ప్రస్తావనతో ఈ సంపుటి, ఒక వజ్రపు వెలుగుల్ని తన ముఖచిత్రా నికి అద్దు కున్నట్లుగా వుంది. మట్టిని ముద్దాడిన చేతిలో పచ్చని చివురై పులకరిస్తున్న **'మట్టి చివురు'** కవిత, మనిషి ప్రాణవా యువును ఆయువుగా నిలబడే కణాల ఉత్పత్తికి, జనన మరణాల రేఖమీద చెరగని సంతకాన్ని చేస్తోంది.

అన్యాయాల్ని ఎదిరించే చురకత్తిలా తన కలాన్ని ఈ కవయిత్రి మార్చుకుంటోంది. మొద్దునిదుర పోతు న్న మెదల్లలో ఆలోచనా మొలకల్ని విత్తే హాలికుడి నాగలిలా తన కలాన్ని కాలం ఆకురాయి మీద నిత్యం సాన బెట్టుకునే కార్యక్రమం కొనసాగుతూనే వుంది. అవకాశవాదుల తొత్తులు గా మారే గుంటనక్కల గుండెల్లో అక్షర గునపం దించేందుకు ధైర్యపు వచనాన్ని కవచంలా ధరింపజేసిన సందర్భాలను ఈ సంపుటి అందిస్తోంది.

ఈ కవయిత్రి కలను సాకారం చేస్తూ, కవితా కిరీటాన్ని ఆమెకు అలంకరింపజేస్తూ చప్పట్లు కొడు తోంది.

ఈ దృశ్యాన్ని సాధించ టానికి ఈ కవయిత్రి మీటిన భావతంత్రులు, ప్రతి సారి ఎదురుపడ్డ పదాల్ని బామాలి భుజానున్న సంచిలో వేసుకున్న సాయం సంధ్యలు, రోజుల తరబడి అక్షరాల లావణ్యం కోసం పడిన కష్టాలు, త్యాగాలు, పట్టుదలలు, నేడు కవితోత్సవం ముందు హాజరయి హాజ రుపట్టికలో సగౌరవంగా సంతకాలు పెడుతున్నాయి.

మన్నును, మిన్నును రక్షించుకుంటూ, శ్రమవిలువల వలువలను చుట్టేసుకుని, సమసమాజ శ్రేయస్సుకై పాటుపడాలని కవిత్వ రథానికి విశ్వాసపు పూనికలూన్చి, మకిలి పట్టిన ఛాందన భావజాల హద్దులను చెరిపేస్తూ, నిన్నటి నిరాశా నిస్పృహల తెరలను తొలగిస్తూ, క్రొంగొత్త మది వీణలను శృతిచేసి, ఒంటరై పోతున్న జీవితాలకు ఓదార్పు వాక్యంగా తన కవితలను నిలపా లన్న సంకల్పంతో విజయతీరా లవైపు సాగిపోతానంటోంది ఈ కవయిత్రి. **'కడదాకా ఈ శ్వాసలో పలికే ఆర్తి గీతమై, స్వరాల శృతుల్ని సవరిస్తావా.. నేను పోయాక కూడా ఓ పరిమళ వాక్యమై నిలిచి పోతావా.. నీవే నేనుగా మిగలనీ..!'** అంటూ తన శ్వాసకు కవిత్వాన్ని ప్రాణ వాయువుగా మార్చుకుంటున్న **'అవధానం అమృత వల్లి'**, ఈ ధరిత్రి మెచ్చే కవయిత్రిగా తెలుగు సాహిత్యంలో నమోదు కావాలని హృదయ పూర్వకంగా కోరుకుందాం.



**–డా॥కె.జి.వేణు**
9848070084





**ప్రతులకు:**
అవధానం అమృతవల్లి
సెల్:90529 12120



–డా॥రావి రంగారావు
9247581825

**2024 జనవరి నుంచి ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు. "వారం వారం కవితల వర్క్ షాప్ 50" అంశం "పులులు సింహాలు కలిసిపోయాయి"ఈ పోటీకి 22 మంది కవులు తమ కవితలు పంపారు. 2 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.**

## పులులూ సింహాలు కలిసిపోయాయి!

అడవి ఇక అడవి కాదు,
అది ఒక సభగా మారింది.
గర్జనలు నినాదాలయ్యాయి,
వేటలు వ్యూహాలయ్యాయి.
నఖాలు దాచుకున్నాయి,
నవ్వులు పదునెక్కాయి.
పులి తన గీతలను
సింహపు జుట్టులో దాచింది,
సింహం తన గర్జనను
పులి కంటిలో నింపుకుంది.
ఇక శత్రువు బయట లేదు,
అంతా లోపలే.
అడవిని కాపాడాల్సినవారే
దాన్ని పంచుకుంటున్నారు.
బలానికి అర్థం మారిపోయింది
ఎవరు కోరిక కలిగి ఉన్నారో కాదు,
ఎవరు నమ్మించగలరో –
వారే రాజులు!
ఇక్కడ న్యాయం
బలహీనుడి శరీరంపై
బలవంతంగా రాసిన శాసనం.
పులులూ సింహాలు కలిసిపోయాయి,
అందుకే
జింకలు ప్రశ్నించటం మానేశాయి,
అడవి మౌనంగా మారింది.
కానీ గుర్తుంచుకోండి –
అడవి మౌనం
ఎప్పుడు భయంతో మాత్రమే కాదు!
సిద్ధమౌతున్న విప్లవానికి సంకేతం కూడా?!

**–తీర్థాల అన్నపూర్ణ వేంకట శర్మ,** హైదరాబాద్

పాలకులు అధికారులు
ఏకమయ్యారు
ప్రజాస్వామ్యంపై దాడి చేసేందుకు!
ప్రజల రక్త మాంసాలతో
తమ ఆకలి దప్పికలు
తీర్చుకుంటున్నారు!
అసలు ఆ మాటకొస్తే
అధికార ప్రతిపక్షాలు
ఇరువురూ ఒకటే కదా!
పేదల సంపదపై
పంజా విసిరి పెద్దలకు
పంచి పెట్టడంలో!!.
అందలమెక్కి
ఊరేగుతున్న అగ్రవర్ణాల
ఐక్యతే వేరు!
అధికారానికి నోచుకోని
అణగారిన వర్గాలున్నది
పల్లకీలు మోసేందుకే!!
తరతరాలుగా వైరమున్న
క్రూర మృగాలన్నీ
ఏకమవుతున్నాయి!
సఖ్యత లేని సాధు జంతువులేమో
కాలు దువ్వి మరీ
కొట్లాడుకుంటున్నాయి!!

**–టి. ధనుంజయ రెడ్డి,** గుంటూరు.

## బడాయిల నక్క

(కథ)



సుందరవనం అనే అడవిలో టక్కరి అనే నక్క ఉండేది. అది ఎప్పుడూ తన గొప్పలను చెప్పుకునేది. ఒకసారి అడవిలో కొన్ని జంతువులు ఒక చోట సమావేశమైనాయి. అక్కడికి వచ్చిన నక్క తాను ఈరోజు పెద్దపులిని ఇక్కడికి రప్పించి దాని చేత మీరు చెప్పిన ఏ పని అయినా చేయిస్తానని వాటితో తన గొప్పలు చెప్పింది. కానీ ఒక కుందేలు మాత్రం "ఆ పని నీతో కాదులే" అని అంది. అప్పుడు నక్కకు చాలా కోపం వచ్చింది. అది కుందేలుతో " నేను ఏది చెప్పినా జరగాల్సిందే! పెద్దపులి అయినా, చిరుతపులి అయినా నా మాట వినాల్సిందే!" అని తన గొప్పలు చెప్పి అక్కడినుండి వెళ్లి పోయింది.

అది తిన్నగా పెద్దపులి వద్దకు వెళ్లింది. అది పెద్దపులితో " ఓ పులిమామా! నీవు ఈరోజు జంతువుల వద్దకు రావాలి. నేను చెప్పిన పని చేసి నన్ను,వాటిని సంతోషపెట్టాలి. నాకు నీ మంచితనం చూడాలని ఉంది "అని అంది . అది విన్న పెద్దపులి " ఓ నక్కా! నాకు ఈరోజు మనసు బాగా లేదు. ఇన్ని జంతువులను ఆకలితో పొట్టనపెట్టుకున్నాననే బాధతో ఉన్నాను. నీ మాట నేను ప్రస్తుతం వినలేను "అని కరాకండిగా చెప్పింది. నక్క ఆ పెద్దపులిని ఎంత బ్రతిమిలాడినా అది వినలేదు. చివరికి నక్క దానికి ఆహారం చూపిస్తానని చెప్పినా ఆ పులి వినలేదు. చివరకు అది చేసేది లేక నిరాశతో జంతువుల వద్దకు తిరిగి వచ్చింది.

అప్పుడు జంతువులు" ఓ నక్కా! నీవు ఈరోజు పెద్దపులిని తీసుకుని వస్తానన్నావు కదా! పెద్దపులి నీ మాట వినలేదా!" అని అడిగాయి. అది విన్న నక్క" అయ్యో! ఈరోజు నేను అనుకున్న పని కాలేదు. రేపు ఖచ్చితంగా చిరుత పులిని తీసుకొని వస్తాను చూడండి . దాని చేత నేను మీరు చెప్పిన పనిని చేయిస్తాను" అని అంది. అప్పుడు కూడా కుందేలు " ఓ నక్కమామా! ఇక నీ గొప్పలు ఆపు" అని అంది.

నక్క వెంటనే ఉక్రోషంతో చిరుతపులి వద్దకు వెళ్లింది. " ఓ చిరుత మామా! ఈరోజు నీవు నేను చెప్పినట్టు వినాలి. నా వెంట జంతువుల వద్దకు రావాలి "అని అంది . అది విన్న చిరుత పులి " ఓ నక్కా! నాకు ఈ రోజు అస్వస్థతగా ఉంది . కావున నేను నీ వెంట రాలేను "అని బదులిచ్చింది . నక్క ఆ చిరుత పులిని కూడా ఎంత బ్రతిమిలాడినా అది వినలేదు.

నక్క తిరిగి నిరాశతో జంతువుల వద్దకు వచ్చి " అయ్యో ! ఈరోజు కూడా నేను అనుకున్న పని జరగలేదు" అని అంది . అప్పుడే అక్కడికి వచ్చిన కుందేలు" నక్క మామా! ఎప్పుడూ మనమే గొప్ప అని చెప్పకూడదు. మన తెలివితేటలు ఎల్లవేళలా పనిచేయవు. దానికి కాలం కూడా కలిసి రావాలి . ఒక్కొక్కసారి మనం అనుకున్న పనులు జరగవు . అందువల్ల ఇతరులతో ముందు మనం గొప్పలు చెప్పి అవమానం పాలు కాకూడదు. మరొకసారి ఇలా గొప్పలు చెప్పుకోకు "అని హితోపదేశం చేసింది. అప్పుడు ఆ నక్క" నాకు బుద్ధి వచ్చింది "అంటూ అది అక్కడి నుండి వెళ్ళిపోయింది.



నిర్వహణ
–కందుకూరి శ్రీరాములు
–బెల్లంకొండ సంపత్ కుమార్

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

## గీయని చిత్రం

కనువిందు కవనం ఈ ప్రకృతి
పచ్చదన పరిమళాలు.
ఎన్నెన్ని ఆకారాల వృక్ష సంపదో
చూపులనెగిరేసే విజయ కేతనాలు
రంగులుమారి సరంగుల్లా
గాలి అలలను అద్దుకుని
ఆకట్టుకునే ఆకుల విన్యాసాలు
కళ్లకు నేర్పిన
ఆనందాన్ని మనసుకు అద్ది
నన్నో ఆశ్చర్యాన్ని చేస్తున్నది
అంతటా సంతరించుకున్న శోభ నే
మనుషుల తత్వాల్లో మరువలేని బంధనాల్లో
వావి వరుసల్లో
రహదారుల పరుగుల్లో వారధుల్లో
నిలువెత్తు నిర్మాణాల్లో
అంతటా అందమే అన్నిటా అందమే
ఆనందం పరమావధి గా
పతనం కానిదిగా
పూల మొక్కల హంగుల్లో
వనాల మధ్య విహారం లా
నేనో అక్షరమై వెలిగినట్టు
చూపుల పుస్తకం రాస్తున్నది హృదయం.

**– డాక్టర్ కొండపల్లి నీహారిణి**

## తొంగి చూస్తావా!

ప్రతి చీకటి ముగుస్తుంది
ఒక కొత్త ఉదయం వెలిగి
అలసి సొలసి న జీవికి
ఆ చీకటే రేపటి చైతన్యానికి
నవ జీవం పోస్తుంది
చీకట్లు ఉంటే వెలుగుండదు
వెలుగు ఉంటే చీకట్లు ఉండవు
చీకటివెలుగుల దాగుడుమూతలు
ఒకదాని వెంట ఒకటి
చక్ర భ్రమణాలై
అలుపు లేని ఉరుకులాటలు
ఒకదానికొకటి దొరుకుతుందా
ఒకటి ఉంటే మరొకటి
ఏ బొరియ లో దాగుందునో
చీకటి వెలుగులకు తావివ్వని
తావులు గలవే తరచి చూడ!
అన్నీ దాగే తావొకటుంది
తొంగి చూస్తావా దొరుకుతుందేమో
నిత్యం కొత్తగ మొలిచే ఉదయాల
అంతు లేని ఆ మనసు గుహ!

**–పల్లొళ్ళ బక్కారెడ్డి**
9705315250

## రోడ్లను ఎవరూ పట్టించుకోవడం లేదు

దబ దబ రోడ్లు వేయడం జాతర జాతర సందడి
ఈ రోజు వేసిన రోడ్డు రేపు మట్టి దిబ్బ
రోడ్డు వేసినట్లు లేదు
రోడ్డు మీద మట్టి పోసినట్లే
కంకర తేలి రోడ్డంతా వంకర టింకర.
ఎన్నో ప్రమాదాలు జరిగి రోడ్డు బద్ నామ్
యమపురికి సూటి తోవ
ప్రజాధనం ధూళి ధూళి
వాన పడితే బురద బురద.
రోడ్లను పట్టించుకోవడం లేదు
మళ్లీ ఎన్నికలు వస్తే కొత్తగా రోడ్డు బాగౌతుందేమో

**– కందాళై రాఘవాచార్య**
8790593638

## మోమద్దం

ఇన్నాళ్లూ లేని ఇవ్వాళ్ల
నీ మోములో అద్దాన్ని చూశాను!.
నువ్వో
ఆణిముత్యానివని
అందులో అక్షరాన్ని చెక్కాను.
నువ్వోగొప్ప నేర్పరివని
ఓర్పుతో విలువిద్య అప్పజెప్పాను
ఏది గొప్పదో అది విద్య !.
ధ్యానం అధ్వాన్నంకాకూడదు
ఆరాధన అపరాధం పడకూడదు.
కన్నొక్కటే
గురి కావాలి !
సారించిన అస్త్రాలన్నీ
సంధించాలి!.
చిట్ట చివరకు
చిట్టా విప్పుతున్నా –
నీలో మోడును చూడలేను
నువ్వు వెలుగవ్వాలి !
నీ వ్యూహం వాగవ్వాలి !!.

**–కందుకూరిశ్రీరాములు**
9440119245



పుస్తకావిష్కరణలో ఎ. మల్లికార్జున రెడ్డి, దేవరాజు రాంబాబు, కాకరాల పద్మాకర్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా॥ బి. జనార్ధనరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, హాస్యబ్రహ్మ శంకర నారాయణ, రావూరి వనజ.

## 'వాట్సప్పీయం' ఆవిష్కరణ

ఆధునిక సమాజాన్ని అభివర్ణిస్తూ రచనలు రావడం అభినందనీయమని వక్తలు అన్నారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆచార్య మసన చెన్నప్ప రచించిన **'వాట్సప్పీయం'** (కవిద్వయం పద్య సంభాషణ) పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా॥బి. జనార్ధనరెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డా॥ మంజులా, మల్లికార్జున్‌రెడ్డి దంపతులకు అంకితం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజ హితం కోరే సాహిత్యం రావాలని అన్నారు. కొత్తతరం యువత నుంచి రచనలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డా॥కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య దేవరాజు రాంబాబు, హాస్య బ్రహ్మ శంకర నారాయణ, కాకరాల పద్మాకర్, రావూరి వనజ, ప్రమీల, ఎ.మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'కవిత్వం రాసే చేతులు' పుస్తకావిష్కరణ



జనవరి 10న విజయవాడలో విజయవాడ పుస్తక మహోత్సవం వేదికపై చలపాక ప్రకాష్ కవితా సంపుటి **'కవిత్వం రాసే చేతులు'** ఆవిష్కరిస్తున్న ప్రజాశక్తి లక్ష్మయ్య. చిత్రంలో డాక్టర్ వెన్న వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆకాశవాణి విజయవాడ ఇంచార్జ్ డాక్టర్ చందూరు మాణిక్యరావు, టీవీ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, నానా, వశిష్ట సోమేపల్లి ఉన్నారు.

## పారా మోటార్ ఏరియల్ అడ్వెంచర్‌ను ప్రారంభం...

అమరావతి, జనవరి 9:సంక్రాంతి పండుగ ఆటవిడుపు .. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పారామోటార్ ఏరియల్ అడ్వెంచర్ ప్రారంభించారు. తొలిసారిగా భీమవరంలో ఏర్పాటు చేవారు. సాంప్రదాయ పోటీలతో పాటు అడ్వెంచర్ రైడ్ ను కూడా భీమవరంకు పరిచయం అయింది. జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి తొలి రైడ్ చేశారు. భద్రతా ప్రమాణాలతో రైడ్ సురక్షితంగా జరిగింది. సంక్రాంతికి భీమవరం పట్టణ ప్రజలు, పట్టణానికి వచ్చిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమవరంలో ఎన్నడూ లేని విధంగా సాంప్రదాయ పోటీలతో పాటు పారామోటర్ ఏరియల్ అడ్వెంచర్ స్కై రైడ్ ను కూడా తీసుకురావడం జరిగిందని, పట్టణ ప్రజలు, సంక్రాంతికి పట్నానికి వచ్చిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు తెలిపారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1678వ రోజు 'సంక్రాంతి' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'సంక్రాంతి' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

### క్రాంతి

క్రాంతి సంక్రాంతి
విభ్రాంతితో సందళ్లు
కళ్లుచెదిరే రంగవల్లులు
గొబ్బెమ్మల కొప్పుపై కులికే
బంతి చేమంతులు.
కోలాటాలు
పతంగీల పోరాటాలు
పోటీగా ఎగిరే విహంగాలు
ఇంటింట బొమ్మలకొలువులు
జలజలరాలే భోగిపండ్లు
పిల్లల కేరింతలు.
ముద్దుముద్దుగా మూగ్రోజులు
ముచ్చటగా గంగిరెద్దులాటలు
బుడబుక్కల
హరిలో రంగ హరి అంటూ
కృష్ణార్పణం స్మరణతో
పల్లెల్లో పశువుల అలంకరణ
పరుగుపందాలతో రైతన్నలు.
కొత్త బియ్యం
పాలు బెల్లంతో కుతకుత
సూర్యకాంతిలో ఆవు పిడకలపై
పర్యావరణ పరిరక్షణ
ఆరోగ్యం
చెరుకుతో దంతాలకి దృఢత్వం
పౌష్యలక్ష్మి ఇచ్చే
సంతోష సౌభాగ్యాలు.
-ఎ.రాజ్యశ్రీ

### మకర సంక్రాంతి శోభ

సూర్య భగవానుడు
మకర రాశిలో ప్రవేశించే
సమయం
ఉత్తరాయణ పుణ్య కాలం
పసుగుమ్మాలు
మామిడాకుల తోరణాలు
బంతిపూల దండల అలంకరణలు
పేడ కళ్ళాపు జల్లుల వాకిళ్ళు
రంగు రంగుల రంగవల్లుల
వాకిట
అతివల చేతినుండి
జాలువారి నర్తించే
చుక్కల ముగ్గుల వేడుకలు
పుణ్య కాలం ప్రవేశించే వరకూ
ఉపవాసముండి
పసుపు, కుంకుమ
పండ్లు ధార పోసి
అందరికీ పంచుకొని
కొత్త బియ్యం
ఆవు పాలతో
పొంగలి ప్రసాదం
పెద్దలకు కొత్త బట్టలు సమర్పించి
ఆశీర్వాదాలు పొందడం
పిండి వంటల నైవేద్యాలతో
కూతుళ్ళు, అల్లు ళ్లు
కొడుకులు, కోడళ్ళు
మనుమలు
అల్లుళ్ల అలకలు
కూతుర్ల కులుకులు

### వర్ష వర్షే ప్రయుక్తే సంక్రాంతి

శుభకర అంబర చుంబిత
అత్యద్భుత సంతోషకర
ఆనంద మకర సంక్రమణం
ఇదే ఉత్తరాయణ పుణ్యకాలం
పంటలతో లోగిళ్ళు పరవళ్ళు
కొత్త పంటల వంటల శోభిల్లు
ఒన గూడు దానధర్మ
శుభయోగాలు
దివ్య ఉత్సవాల పందిళ్ళు.
పక్షుల పరవళ్ళు

### వచ్చిందోయ్

పల్లవి: వచ్చిందోయ్ సంక్రాంతి
తెచ్చిందోయ్ కన్నుల కాంతి.
చరణం 1: కొత్త బట్టలు
తీయని తాయిలాలు
గాలిపటాల ఎగురవేత
తోటివారితో కేరింతలు
బాలలకై వచ్చిందోయ్ సంక్రాంతి
తెచ్చిందోయ్ కనుల కాంతి!.
చరణం 2: సంతానం రాక
ఇల్లంతా కళకళ
మనవళ్ళు, మనవరాళ్ళు
ముద్దు మురిపాలు
అమ్మకై వచ్చిందోయ్ సంక్రాంతి..
తెచ్చిందోయ్ కన్నుల కాంతి!
చరణం 3: కొత్త ధాన్యపు రాక
పంచభక్ష్య పరమాన్నాలు
పంచుకునే ఆనందం
రైతులకై వచ్చిందోయ్ సంక్రాంతి
తెచ్చిందోయ్ కన్నుల కాంతి!.
చరణం 4: ముచ్చటైన ముగ్గులు
కొత్త చీరల రెపరెపలు
నగల ధగధగలు
బొమ్మల కొలువులు
మగువలకై వచ్చిందోయ్ సంక్రాంతి
తెచ్చిందోయ్ కన్నుల కాంతి!.
చరణం 5: కోడి పందాలు
ఎడ్ల పోటీలు
కొత్త కొత్త చలనచిత్రాలు
సరదారాయుళ్ళకై
వచ్చిందోయ్ సంక్రాంతి
తెచ్చిందోయ్ కన్నుల కాంతి!.
-చంద్రకళ దీకొండ

ఇల్లంతా సందడి
మరదళ్ళు-బావలు
బావమరుదుల
హాస్యాలు
కొత్త బట్టల వేడుక
కొత్త, పాత అల్లుళ్ళకు
కట్నాలు కానుకలు
గొబ్బెమ్మల పూజ
భోగి మంటలు
చిన్నారి పాపలకు దిష్టి తీసే
రేగుపండ్ల వేడుక
హరిదాసు కీర్తనలు
గంగిరెద్దు విన్యాసాలు
కోడి పందేలు
గాలి పటాల ఎగరవేత
పేకాటలు
ఎన్నెన్నో వేడుకల ముచ్చట్ల
వెలుగుల సంక్రాంతి శోభ
సస్య లక్ష్మి
ధాన్య రాశులు
ఇంటికి చేరే శుభ వేళ
మన సంస్కృతి సంప్రదాయాల
ఆనందం వెల్లి విరిసే
ఆ మకర సంక్రాంతి శోభలోని
సంతోషాలను వర్ణించతరమా!.
-రేవిణిపాటి రమాదేవి

ఆనందాల హరివిల్లు
పసిపిల్లల గొబ్బిళ్ళు
పిడకల మంటలు
కొత్త బట్టల విన్యాసాలతో
పండుగలుఅనంత సమ్మోహనాల
రంగుల హరివిల్లు!.
జీవితానందాల సొబగులు
మానసిక సంతోష సమ్మోహనాలు
ఆనందాలతో నింపే
సహజ, నిజ, జాగరూకావస్థల
జీవరాసుల ఆనందాల
అపురూప హేల!!.
-కె.కె.తాయారు

### మూడు రోజుల పండుగ

కొక్కొరొకో కోడి కూసింది
పల్లె నిద్దుర లేచింది
పొగ మంచు తెరలు తొలగింది
నులి వెచ్చని సెగ తగిలింది
మిల మిల మెరుపులు
తళ తళ కాంతులు
సూర్యుని వెలుగుల కాంతి
సంక్రాంతి ముస్తాబయింది
సంక్రాంతి సంతోషం
సరదాల సందళ్లు
ఉప్పొంగే ఆనందం
పంటచేల పచ్చదనం
భోగిమంట వెలుగుల్లో
పల్లె బంగారు కాంతుల్లో
తెలుగింటి అమ్మాయి
పచ్చని చీర చుట్టింది
చక్కని కుచ్చిళ్ళు చెక్కింది
చెంగు పైటన కప్పింది
ఆకుపచ్చ రైక తొడిగింది
కళ్ళాపు జల్లిన లోగిల్లో
గన్నేరు పూసిన వాకిట్లో
బంగారు రేకుల బంతుల్లో
చేమంతి లోపల గొబ్బిళ్ళు
పిల్లలకు కీడు తొలిగే
భోగి పండ్లు పోసే పేరంటమే
ఇంట బొమ్మల కొలువులే
పట్టు పావడాల మెరుపులే
తెలుగింటి అమ్మాయి కాంతులే
మందారంతో సింగారాలే
అందమంతా మెరవంగా
బాబు గీసిన బొమ్మల్లే
కొమ్మకు పూసిన నవ్వల్లే
కమ్మని కోయిల పాటల్లే
కూచిపూడి మువ్వలా
అచ్చ తెలుగు అందంగా
కొత్త ధాన్యపు రాశులు
హరిదాసు పాటలు
గంగిరెద్దు ఆటలు
ఎడ్ల పందాలు
డూడూ బసవన్న నాట్యాలు
సన్నాయి మేళాలు
పచ్చని తోరణాలు
గుడి గోపురాలు
భక్తి వెలుగులు
చెరకు తీపి బంధాలు
ఏటికొక పెద్ద పండుగై
ఎడబాటును చెరపంగా
కలిసి ఉంటే సుఖమై సాగే
పండుగ అంతా నిండుగా
వచ్చిపోయే చుట్టాల సందళ్లు
పిండి వంటల గుమగుమలు
పాల పొంగళ్ళు తీపి రుచులు
తరతరాల సంస్కృతి
ఘన చరితల పుడమి
సాంప్రదాయాల ప్రగతి
అనుబంధాల వారధి
తెలుగువారి పండుగిది.
-గాదేపల్లి సూర్యకాంతి

### ఆశల పర్వం

కాలంతో మన అనుబంధాన్ని
స్వూర్యుడితో
మన సంబంధాన్ని
తెలుపుతూ
మృతకాలము
అమృతంగా మారే
మంగళ ఘడియలే
మన సంక్రాంతి
ఉత్తరాయణంలో ఉత్సాహంగా
మంచికార్యాలకు శుభారంభంగా
మకర ద్వారం గుండా
భళ్ళున మేల్కొన్న సూర్యుడు
అంధకారపు అంచుల్ని చీల్చి
అనంద నందనమై
వెలుగుల్ని విరజిమ్మగా
మకరంలో కొత్త ఆశలు మొలకెత్తి
భోగి మంటలలో
బాధలు బూడిదై
పొంగలి పాత్రలలో
సిరులు పొంగి
కామధేనువుల కంట
కరుణలు ఉప్పొంగే
మూడుదినాల మహోత్సవం
కవలం పండుగ మాత్రమేకాదు
సంస్కృతి సాగుకై
దేవతలు దీవించే దివ్యసమయం.
-నాగరాజు చుండూరి

### కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### భిన్నత్వంలో ఏకత్వం

బ్రహ్మ మొకటే పర బ్రహ్మ మొకటే
మనుషులంతా ఒక్కటే మనసులెంత భిన్నం
అందరినీ కాచి కాపాడే దైవం
ఒకరే ఎన్నో భిన్నమైన పేర్లు
కడుపుకింత తినడానికే కదా ఉపాధి.
రాళ్లు కొట్టినా పైళ్లు రాసినా
పైకం రాళ్ళ కోసమేగా
రుచులెన్ని ఉన్నా రుచి చూసే
నాలుక ఒకటే
సరిగమలెన్ని వున్నా
స్పందించే హృదయం ఒకటే..
వ్యతిరేక భావాలు గల స్త్రీ పురుషులు
కలసి కాపురం చేయడం
భిన్నత్వం లో ఏకత్వమే కదా
భాష ఏదైనా భావమొక్కటే
ప్రాణి ఏదైనా ప్రాణమొక్కటేరకరకాల
మతాల కులాల ప్రాంతాల
యాసల మనమంతా భారతీయులమే.
ఆ తల్లి ముద్దు బిడ్డలమే అందుకే కులమతాల
చిచ్చు పెట్టే ఏ సోదరుడు అదుపు తప్పినా
కీడు తలపెట్టినా
గమనించి సరిదిద్దవలసిన బాధ్యత
అందరి మీదా వుంది
-ఎ విక్టోరియా రాణి

### నా చెలియా

నీవు కనపడితే చాలు
అడుగులు తడబడతాయి, చెలియా!
నీ పేరు గుర్తుకు వచ్చిన చాలు
మనసు పరవశిస్తుంది ,సఖియా!
నిన్ను చూడడం కోసం నా కనులు పరిభ్రమిస్తూ..
నీ చూపులను తాకడం కోసం భ్రమిస్తూ..
నీ ఆలోచనలే శ్వాసగా నిరంతరం తపిస్తూ ,
రమిస్తూ..

మూడున్నర దశాబ్దాల కింద
ముచ్చటలాడిన మాటలు.
నీకై ఎదురుచూసిన
ఎఱ్ఱ గులాబీల పొట్లం పరిమళాలు.
కాలేజీ పొట్టి బస్సులో నీకోసం ఎదురుచూసిన
ఖాళీ సీటు.
నీ పేరు నా ఆలాపన
నీవంటే మదిలో ఏదో ఆరాధన.
మనసులు కలిశాక కుదరలేదు మనువాడటం,
నా పేదరికం.
నా పేద జీవితంలో వెన్నంటిన అభద్రతాభావం.
వేచి చూడలేదు.
నేను ఇప్పుడు ఒక కుటుంబీకుడిని.
మరొకరికి సొంతం.
ఉన్నతమైన నీ ప్రేమ ముందు నేనొక పరాజితుడిని.
అలాగే అవివాహితగ మిగిలిపోయిన
నిన్ను చూసినప్పుడు,
ప్రతిసారి బద్దలవుతూనే ఉంది నా గుండె.
బతికే ఉన్నాను అయినా.
ప్రేమ విజేతను నేను కాదు.
కానీ నీ పైన ఎన్నో రెట్లు పెరిగిన ఆరాధన
-ముక్కా సత్యనారాయణ్
9441120047

### జీవితానుబంధ తోరణాలు

బొడ్డుతాడుతో గర్భానా బిడ్డతో బంధం,
మాతాశిశూ తొలి అనురాగ తోరణం!
రుధిరాన్ని అమృతమయమైన పాలు గా మార్చి,
ఆ దైవం కలుపు తల్లి బిడ్డల రక్తసంబంధం!
చనుబాలు గ్రోలు పసిదాని(వాని) కనులలో ఆనందం,
జననికి పసిబిడ్డతో వాత్సల్య తోరణాలు!
స్వేదాన్ని చిందించి పోషించే నాన్న పెంపకం,
జనకుని బాధ్యతల తోరణాలు!
కన్నబిడ్డలపై కడుపారా కడవరకు ప్రేమ బంధం,
తల్లిదండ్రుల అవాజ్యమైనప్రేమ
మమతల తోరణాలు!
తోడబుట్టిన తోబుట్టువుల మమకారం,
కలకాలం మమతానురాగాల తోరణాలు!
ప్రాణస్నేహితుల హితం కోరే స్నేహం,
జగమున ఎప్పటికీ నిలిచే స్నేహబంధాల తోరణాలు!
కలిమిలేముల్లో,కష్టసుఖాల్లో,తోడునీడై నిలిచే బంధం,
అర్ధభాగమై జీవనమున,
జీవమున్నంత వరకు అనుబంధం,
ఆలు మగల అన్యోన్య దాంపత్యబంధ తోరణాలు!
జగతి కొలిచే ఆ సర్వేశ్వరునితో బంధం,
జనులకు ఆధ్యాత్మిక బంధాల తోరణాలు,
మోక్షాన్ని ప్రసాదించే మోక్ష మార్గాలు!
ఇవే మానవునికి చివరి వరకు ఉండే,
జీవితానుబంధ తోరణాలు!
-సయ్యద్ అబ్దుల్ నజీర్
8897811024.

# చింతల చేను నవల ఆవిష్కరణ




పుస్తకావిష్కరణలో అతిథులు

తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన చింతల చేను నవల ఆవిష్కరణ సభ ఈనెల11న ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిం. పుస్తక సమీక్షకులు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ... రచయితకు ప్రకృతితో, సమాజం తో కలిగిన సంఘర్షణ కారణంగా రచనకు బీజం వేస్తుంది.

ఈ నవలలో గ్రామ జీవనం, మారుతున్న ఆర్థిక వ్యవస్థ, కొత్త ఆశలు, రైతులు వ్యాపారాలు చేసుకునే కొత్త విధానంలోకి మారడం, అక్కడ దెబ్బతినడం వంటి సమకాలీన అంశాలు అనేక ఉన్నాయి. జీవితంలోని వైరుధ్యాలను చిత్రించిన చక్కని నవల చింతల చేను అని అన్నారు. సభకు తిరసం గౌరవ అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహించారు. ద్రవిడ విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కాగా శంకరంబాడి సుందరాచారి పీఠం అధ్యక్షులు డాక్టర్ డి. మస్తానమ్మ, శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ భీమన్న ఆత్మీయ అతిధులుగా హాజరయ్యారు. రచయితను అభినందించారు. సభలో నవల రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు, తిరసం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, సాకం నాగరాజ, వాకా ప్రసాద్, ఎస్పీడబ్ల్యు కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మి, నాదెళ్ల శ్రీమన్నారాయణ, గాలి గుణ శేఖర్, మౌని, కొత్వాలు అమరేంద్ర, సురేంద్ర రొడ్డ, గరికపాటి రమేష్ బాబు తదితర సాహితీ ప్రియులు పలువురు పాల్గొన్నారు.

# నలుగురికి జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు



రాధేయ



ఇల్ల మురళీధరరావు



నాగజ్యోతి శేఖర్



కుందుర్తి కవిత

హైదరాబాద్, జనవరి 13:గత 11 సంవత్సరాలుగా గుంటూరు "రావి రంగారావు సాహిత్య పీఠం" ఏటేటా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు (2025) ప్రకటించారు. ఇల్ల మురళీధరరావు (విశాఖపట్నం) రచించిన పద్య సంపుటి "శతకాలు", నాగజ్యోతి శేఖర్ (పోలవరం, కోనసీమ) రచించిన వచన కవితల సంపుటి ''చిగురించే పేజీలు'', డా. రాధేయ (అనంతపురం) రచించిన వచన కవితల సంపుటి "పావు కోళ్ళు", కుందుర్తి కవిత (హైదరాబాద్) రచించిన వచన కవితల సంపుటి "జస్ట్ ఏ హౌస్ వైఫ్"... పుస్తకాలు ఎంపికైనాయి. ఈ పోటీకి పద్యాల సంపుటాలు, గేయాల సంపుటాలు, వచన కవితల సంపుటాలు, లఘు కవితల సంపుటాలు, బాలగేయాల సంపుటాలు... ఆహ్వానించడం జరిగింది. అందిన 87 కవితల సంపుటాలలో నాలుగు పుస్తకాలకు జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు లభించాయి. గుంటూరులో బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదిక మీద ఫిబ్రవరి 5వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రముఖుల సమక్షంలో ఒకో కవికి మూడు వేల రూపాయల నగదు బహుమతి, శాలువా, జ్ఞాపికతో సత్కారం ఉంటుందని రావి రంగారావు సాహిత్య పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## పాలమూరు సాహితి అవార్డు - 2025 కు కవితా సంపుటాల ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 13: తెలుగు సాహిత్యంలో ఉత్తమ వచన కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు ప్రతి సంవత్సరం పాలమూరు సాహితీ అవార్డులను ప్రదానం చేస్తున్న సంగతి సాహితీవేత్తలందరికీ తెలిసిందే. గతంలో ఈ అవార్డులను ప్రముఖ కవులు డా. రాధేయ, డా. కాసుల లింగారెడ్డి, డా. పెన్నా శివరామకృష్ణ, కందుకూరి శ్రీరాములు, అంబటి నారాయణ, ఎస్.హరగోపాల్, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, చిత్తలూరి సత్యనారాయణ, తగుళ్ళ గోపాల్, డాక్టర్ జెల్లి విద్యాధర్ రావు, డా.బాణాల శ్రీనివాసరావు, డా. కాంచనపల్లి గోవర్ధన్ రాజులు ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ పురస్కారం కోసం 2025 సంవత్సరంలో ముద్రితమైన వచన కవితా సంపుటాలను మాత్రమే మూడేసి ప్రతులను పంపించాల్సిందిగా కోరుతున్నారు. కావున కవులు తమ ప్రతులను డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇం.నం. 8-5-38, టీచర్స్ కాలని, మహబూబ్ నగర్ - 509001, తెలంగాణ రాష్ట్రం అనే చిరునామాకు జనవరి 31 లోపు పంపాలని ఆయన కోరారు. బహుమతి పొందిన ఉత్తమ వచన కవితా సంపుటికి రూ.5, 116/- నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తారు.



ఆదివారం శ్రీత్యాగరాయ గానసభలోని సంగీత నాట్య కళా వేదికపై గానసభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరుగుతున్న త్యాగరాయ స్వామి ఆరాధన కార్యక్రమంలో ప్రఖ్యాత సంగీత గురువు మల్లాది ఉష బృందం సభ్యులతో కలిసి గానం చేసారు. ఈసందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ సంగీత గురువు మల్లాది ఉషను సత్కరించారు. కార్యక్రమంలో కళా జనార్ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

### నువ్వుంటే ఇంతే!

కబుర్లుచెప్పేనేస్తం లేనివేళ!నువ్వొచ్చావు!
కబుర్లుతెచ్చే కాకులు లేనివేళ!నువ్వు తెచ్చావు!
మనసుకు నచ్చినదానివి!మనసిచ్చాను
మనసులో దూరినదానివి!మదిదోచావు!.
రేడియో, టేపు, వాచీ, కెమెరా నువ్వేనువ్వే!
ట్రాన్సిస్టర్,టీవీ, క్యాలెండరు, అలారం నువ్వే!
నువ్వొచ్చాక మాయం పోస్టుకార్డు, లెటర్!
నీ రాకతో మాయం ఎక్కాలు, కాలిక్యులేటర్!.
నీరాక చూపించింది మనిషికి ప్రత్యామ్నాయం!
కానీ ప్రేమానుబంధాల ఉనికి అయోమయం!
సాంకేతికంగా ఎంతెదిగినా ఎక్కడ సమన్యాయం?
నీరాకతో కుటుంబబంధాలకు అన్యాయం!.
సతికి పతియే వద్దంట!పతికి సతియె రద్దంట!
ఎవరికెవరు వద్దంట!ఎల్లరకు నువ్వు ముద్దంట!
మాటకు సరిహద్దంట!మెదడు అయ్యె మొద్దంట!
పలుకు పప్పుసుద్దంట!ఫోను చూడబుద్దంట!.
సక్సెసుకోలైకు!సంబరానికి కేకు!సంబంధాల్ వాకు
దుఃఖ్ఖానికో డ్రాపు! దూరపు వేడుకకో క్లాపు!
సందర్భానికోఎమోజీ! సెండింగులో నో రాజీ!
చేతికొచ్చె సెల్ఫీ స్టాండు!బ్రతుకయ్యె బస్టాండు!.
-పొర్ల వేణుగోపాల రావు
రాజన్న సిరిసిల్ల

### కాకు స్మార్టుఫోనుకు బంధీవి

మొబైల్ యుగపు
ఓ మనిషి అన్న పదం
మొబైలు వాడకం జీవనశైలిలో
తెచ్చిన మార్పులను
మొబైలుకు అలవాటు పడ్డ మనిషి తీరుతెన్నులను
జనం మొబైళ్లకు బానిసలుగా మారుతున్న వైనం
వంటి విపరీత పరిస్థితులను వర్ణిస్తుంది.
మొబైలులో ఉన్న అత్యాధునికి సాంకేతికత
అందుకు ప్రధానమైన కారణం
రేడియో మొదలు రొమాన్సు వరకు
క్యాలికులేటర్ మొదలు కెమెరా వరకు
అంతరిక్షం నుండి, అశ్లీల దృశ్యాల వరకు
సోషల్ మీడియా నుండి సంకీర్ణ వార్తల వరకు
విజ్ఞానం నుండి వింతలు విశేషాల వరకు
సర్వస్వం మొబైలులో సంసిద్ధం
మొబైలందుకే అందరికయ్యిందంత ప్రాధాన్యం
ఆయె, పిల్లా పెద్దా పండిత పామర వ్యామోహం.
మాటల తుంచి, దూరం పెంచిన మహమ్మారి
కాపురాలను కూలుస్తున్న కలకంఠి
మానవ బంధాలను తెంచిన వయ్యారి
యువతను ముంచుతున్న వగలాడి.
మొబైల్ యుగపు ఓ మనిషి
వాడుకో దానిని జ్ఞానం పెంచుకోడానికి
ఉపయోగించుకో దానిని సన్మార్గానికి
నీవపుడు సాంకేతికతను వాడుకున్న సారధివి
విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న వారధివి
బానిసగా మారితే నువ్వు దానికి బంధీవి.
-జె వి కుమార్ చేపూరి

### చరవాణి చెరలో !

ఓ నా రాణీ! చరవాణీ!
కుదురుగా ఒక్క చోట
ఉండవు కదా!
అందరినీ మత్తులో ముంచిన
నువ్వొక మాయావివి...
చిన్నాపెద్దా ఆడామగా తేడా
లేకుండా వశపరుచుకున్నావు
నువ్వులేకుండా ఒక్కక్షణం
గడపలేని వారిగా మార్చావు కదే
సొంత దేశంలో దొరికినా నిన్ను
విదేశాలలో కొని తెచ్చానే !
నిద్ర నుండి లేవగానే
నిన్నే చూడాలి
నువ్వే కావాలి
ఎక్కడ ఉన్నా ఏ పనిలో ఉన్నా
నీకై వెదకటమే
సంబంధ బాంధవ్యాల కంటే
నువ్వే గట్టి బంధమయ్యావ్..
నీ రాకతో
చరిత్రను తిరగరాసావు
ఎక్కడ పుడితే ఏమి
విశ్వమంతా అంటువ్యాధివైనావు
యంత్రాలు,
తంతులన్నీ మాయంచేసిన
నువ్వే ఎక్కడ మాయమైతివే !.
నువ్వు లేకపోతే నన్నొక బికారిలా
చూస్తున్నారు
విదేశాల్లో ఉన్న వాళ్లతో వీడియో
మాట్లాడలనుకున్నా
ఇటు చూసి అటు చూడగానే
అంతుచిక్కకుండా పోయావ్...
నిన్ను నేను నమ్మనింకా
ఇంట్లో
గడియారాలను టార్చిలైట్లను
మింగిన నిన్ను
ఎవరు దోచారో కదా !
విందు వినోదాలలో నువ్వే
కార్యాలయ పనుల్లో నువ్వే
పిల్లల ఏడుపు ఆపడానికీ నువ్వే
చెడగొట్టడానికి నువ్వే
పనికిరాని చొల్లు కబుర్లలో నువ్వే
అవసరాలకు
అవకాశాలకు నువ్వే..
నీ మాయాజాలంలో
అంతర్జాలం
మునిగితేలుతుంది
మరి నీ జాడ తెలుసుకోలేక
బుర్రపోతోంది కదే!.
మానవజాతికి కీర్తిని తెచ్చిపెట్టేది
నువ్వే
జీవితాలను దూరం చేసేది
నువ్వే
అందరినీ బానిస చేసుకొని
అరచేతిలో
వైకుంఠం చూపిస్తున్నావ్
నీవో మాయలేడివి
వ్యయప్రయాసలు పడ్డ
నన్ను విడిచి మాయలాడిలా
దాగుడుమూతలాపిక....!!
-పద్మ చిగురాల.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com